తెలుగు జాలర్ల
శాంతియుత నిరసనలపై
హింస దుర్మార్గం
- పోలీసుల దాడిని ఖండించిన సిపిఎం
- అండమాన్ నికోబార్ ఎల్‌జికి ఆ రాష్ట్ర కార్యదర్శి లేఖ

• లోపలి పేజీలో..•

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 339 | విజయవాడ, శుక్రవారం 12 జులై 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 12 July 2024 | Rs



ఫైనల్‌కు పాలిని, క్రేజికోవా
- వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ 8

ఆర్థిక హబ్‌గా భోగాపురం

- యుద్ధప్రాతిపదికన పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు
- పెట్టుబడులకు రాష్ట్రం అనుకూలం
- ఉత్తరాంధ్ర పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు



పోలవరం ఎడమ ప్రధాన కాలువను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి- యంత్రాంగం

భోగాపురం ప్రాంతాన్ని ఎకనామిక్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా గురువారం ఆయన భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పనులను పరిశీలించారు. ప్రభుత్వ అధికారులు, ఎయిర్‌పోర్టు నిర్మాణ సంస్థ (జిఎంఆర్) అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 నాటికి ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తెస్తామని చెప్పారు. దీని ప్రారంభ సామర్థ్యం 4.5 మిలియన్ ప్రయాణికులు కాగా, క్రమంగా 45 మిలియన్ ప్రయాణికుల వరకు పెంచుతామన్నారు. ప్రస్తుతం విశాఖపట్నం ఎయిర్‌పోర్టు 2.8 మిలియన్ ప్రయాణికులకు సేవలందిస్తోందని తెలిపారు. 45 మిలియన్ ప్రయాణికుల రాకపోకల అవసరాలకు తగ్గట్టు హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు మాదిరిగా రోడ్డు కనెక్టవిటీ ఏర్పాటు చేస్తామని, దీంతో బోగాపురం ప్రాంతం ఎకనామిక్ హబ్‌గా మారుతుందని చెప్పారు. త్వరలో కుప్పం, దగదర్తి, నాగార్జునసాగర్, మూలపేటలో కూడా ఎయిర్‌పోర్టులు నిర్మించే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. అంతకుముందు అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ అక్విడెక్ట్ పనులను నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపి సిఎం రమేష్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యుద్ధప్రాతిపదికన పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు పూర్తి చేసి లక్ష ఎకరాలకు సాగునీరు అందించనున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. తొలిదశలో రూ.800 కోట్లతో టెండర్లు పిలిచి పూర్తి చేసే బాధ్యత ఇంజినీర్లకు అప్పజెప్పినట్లు తెలిపారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు 93 కిలోమీటర్ల వరకు పూర్తి చేస్తే లక్ష ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తి చేస్తే అనకాపల్లి జిల్లాలో 2.80 లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని వివరించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తవడానికి సమయం పట్టనున్నడంతో పురుషోత్తపట్నం, పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్‌ల ద్వారా 2,500 క్యూసెక్కుల నీటిని ఈ ప్రాంతానికి తీసుకొస్తామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకొనే ప్రయత్నం చేస్తామని చెప్పారు. విశాఖపట్నాన్ని దోచేసిన దొంగలను వదిలిపెట్టే ప్రసక్తిలేదని వైసిపి నాయకులను ఉద్దేశించి అన్నారు.

సిఐఐ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో ...

గత ప్రభుత్వం మాదిరిగా పెట్టుబడులను అడ్డుకునే ప్రభుత్వం తమది కాదని, రాష్ట్రాభివృద్ధి కోసం పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి తగిన గౌరవం ఇస్తామని చంద్రబాబు చెప్పారు. మెడ్ టెక్ జోన్‌లో మిగతా 7లో

ప్రభుత్వం మారినా ఆగని గృహ నిర్బంధాలు.. 5వ పేజీలో



అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కుమారస్వామి

విశాఖ స్టీల్ ప్లాంట్ స్థితిగతులపై ప్రధానికి నివేదిస్తా

- మూతబడుతుందన్న ఆందోళన వద్దు : కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి

• లోపలి పేజీలో..•



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కెఎం నేతలు

మద్దతు ధరకు చట్టబద్ధత

- మళ్లీ పోరుబాటలో సంయుక్త కిసాన్ మోర్చా
- ఆగస్టు 9న 'కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే' 6

నీట్ కేసులో కీలక నిందితుడు అరెస్టు
- 10 రోజులు సిబిఐ కస్టడీకి 6

యుపిని వణికిస్తున్న వరదలు
- పిడుగుపాటుకు 38 మంది మృతి 7

19 మంది ఐఎఎస్‌ల బదిలీ

- పలువురు ఐపిఎస్‌లు కూడా
- సిసిఎల్‌ఎగా జయలక్ష్మి
- ఐఅండ్‌పిఆర్ డైరక్టర్‌గా హిమాంశు శుక్లా



హిమాన్షు శుక్లా



జయలక్ష్మి



అంజనాసిన్హా



రాజశేఖర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భారీ ఎత్తున ఐఎఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. 19 మందిని ఒకేసారి మార్పులు చేర్పులు చేశారు. అలాగే పలువురు ఐపిఎస్ అధికారులనూ మార్చారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. కీలకమైన సిసిఎల్‌ఎ చీఫ్ కమిషనర్‌గా జయలక్ష్మిని నియమితులయ్యారు. సమాచార, పౌర సంబంధాల శాఖ డైరక్టర్‌గా హిమాంశు శుక్లాను నియమించారు. సమాచార శాఖకు ఐఎఎస్ అధికారిని డైకర్టర్‌గా నియమించడం ఇటీవల కాలంలో ఇదే మొదటిసారి. పోలీసుశాఖ డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తాను విజిలెన్స్ డైరెక్టరుగా నియమించారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా మరో సీనియర్ ఐపిఎస్ అధికారి కుమార విశ్వజిత్‌ను నియమించారు.

ఎస్‌పిఎఫ్ డిజిగా అంజనాసిన్హా .. విజయవాడ సిపిగా ఎస్‌వి రాజశేఖర్

రాష్ట్ర రహదారుల భద్రత సంస్థ ఛైర్మన్ అంజనా సిన్హాను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డిజిగా బదిలీ చేశారు. వెయిటింగ్‌లో వున్న మాదిరెడ్డి ప్రతాప్‌ను ఎపి డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్ డిపార్టుమెంట్ డిజిగా నియమించారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ ఎస్‌వి రాజశేఖర్‌బాబును విజయవాడ పోలీస్ కమిషనర్‌గా బదిలీ చేయగా.. ప్రస్తుతం ఆ స్థానంలో ఉన్న పిహెచ్‌డి రామకృష్ణను పోలీస్ ప్రొవిజనల్స్ అండ్ లాజిస్టిక్ ఐజిగా నియమించారు. అక్టోపస్ ఐజిగా వున్న సిహెచ్ శ్రీకాంత్‌ను లా అండ్ ఆర్డర్ ఐజిగా బదిలీ చేశారు. గ్రేహ్యౌండ్స్ డిఐజి గోపినాథ్ జెట్టిని విశాఖ రేంజ్ డిఐజిగా బదిలీ చేయగా..గ్రేహ్యౌండ్స్ మరో డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్‌ను కర్నూలు రేంజ్ డిఐజిగా బదిలీ చేశారు. విశాఖ డిఐజి విశాల్‌గున్నిని, కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్ విజయరావును డిజిపి కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మంత్రి లోకేష్ వాట్సాప్ బ్లాక్

- సమస్యలను వ్యక్తిగత మెయిల్‌కు పంపాలని వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలు తమ సమస్యలను తన పర్సనల్ మెయిల్‌కు పంపాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు. వాట్సాప్‌కు వచ్చిన మెసేజ్‌కు స్పందించి 25 మంది వికలాంగ విద్యార్థుల సమస్యను ఆయన పరిష్కరించిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రం నలుమూలల నుంచి తమ సమస్యలు పరిష్కరించాలంటూ పంపుతున్న మేసేజ్‌లు పోటెత్తడంతో మంత్రి వాట్సాప్ నెంబర్‌ను మెటా బ్లాక్ చేసింది. దీంతో తన మెయిల్ ఐడి hello.lokesh@ap.gov.inకు వినతులు, సమస్యలు ప్రజలు పంపాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు. సాయం కోసం వచ్చే ప్రజలకు తన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని తెలిపారు. పేరు, ఊరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడి, సమస్య, సహాయానికి సంబంధించిన పూర్తి వివరాలు వినతుల్లో పొందుపరచాలని సూచించారు. వాట్సాప్ తరచూ బ్లాక్ కావడంతో ప్రజలు పంపే సందేశాలు చూసే అవకాశం ఉండటం లేదని, మెయిల్ ఐడికి పంపించాలని విన్నవించారు.

బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేత

- పియూష్ గోయల్ వెల్లడి

న్యూఢిల్లీ : బాస్మతీయేతర బియ్యంపై నిషేధాన్ని ఎత్తివేసే అంశంపై త్వరలోనే మంత్రుల బందం సమావేశం కానుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఫిక్కీ నిర్వహించిన సమావేశంలో మంత్రి పియూష్ మాట్లాడుతూ.. డిమాండ్, సరఫరా, ధరల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని చర్చలు జరుగుతాయన్నారు. భారత ఆహార ఉత్పత్తుల ఎగుమతుల విలువ రూ.4.6 లక్షల కోట్లుగా ఉందన్నారు. గతేడాది జులై నుంచి బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధం ఉంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వందే భారత్‌కు సాంకేతిక లోపం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

విశాఖపట్నం - సికింద్రాబాద్ (20833) వందే భారత్ రైలుకు గురువారం ఉదయం సాంకేతిక లోపం తలెత్తింది. వెంటనే స్పందించిన వాల్తేర్ డివిజన్ అధికారులు ఆ రైలు స్థానంలో 3వ తరగతి ఎసి ఎకానమీతో కూడిన ప్రత్యేక రైలును ఏర్పాటుచేశారు. ఈ ప్రత్యామ్నాయ రైలు సాధారణ సమయం కన్నా గంట ఆలస్యంగా విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు 6:45 గంటలకు బయలుదేరింది. ఈ రైలు షెడ్యూల్ సమయం 2.15 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకోవాల్సి ఉన్నా రెండు గంటల ఆలస్యంగా 4.15 చేరుకుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 3.00 గంటలకు బయలుదేరాల్సిన సికింద్రాబాద్ - విశాఖపట్నం (20834) వందే భారత్ ఎక్స్‌ప్రెస్ 2.20 గంటలు ఆలస్యంగా 5.20 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరింది. ఈ జంట రైళ్లలో పద్నాలుగు 3వ ఎసి ఎకానమీ కోచ్‌లు , రెండు జనరేటర్ మోటార్ కార్లు ఉంటాయని అధికారులు తెలిపారు.

పన్నుల రాబడి క్రమబద్ధీకరణ

- కొత్త పన్నులు వేయడం సరికాదు
- ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల


సచివాలయంలోని తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొత్త పన్నులు వేయడం వల్ల ఉపయోగం లేదని, పన్నుల వసూళ్లను క్రమబద్ధీకరించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని భావిస్తున్నామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఆర్థికశాఖ మంత్రిగా ఆయన గురువారం సచివాలయం రెండో భవనంలోని తన ఛాంబర్‌లో ప్రత్యేక పూజా కార్యక్రమం అనంతరం ప్రవేశించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా నిర్వహించిన ఇష్టాగోష్టిలో అనేక అంశాలపై స్పందించారు. కొత్తగా పన్నులు వేయడం వల్ల ఉపయోగం ఉండదన్న భావాన్ని వ్యక్తం చేశారు. అందుకే వాస్తవ పన్నుల వసూళ్లను క్రమబద్ధీకరించి, సజావుగా వచ్చేలా చూడనున్నట్లు వివరించారు.

జగన్ హయాంలో అనేక కేంద్ర, రాష్ట్ర పథకాలను ఆపేశారని, దీనివల్ల ఎంతో నష్టం వాటిల్లిందని విమర్శించారు. కేంద్ర పథకాల్లో కొన్నింటికి 60 శాతం వరకు నిధులు వస్తాయని, వాటితో చేసిన పనులపై జిఎస్‌టి లాభం కూడా వస్తుందని, అయితే జగన్ నిర్ణయాలు వల్ల అవి రాకుండా పోయాయని వివరించారు. పరిశ్రమల ద్వారా వచ్చే జిఎస్‌టియే ఎక్కువగా ఉంటుందని, ఆ వ్యవస్థ కూడా నాశనమైందని విమర్శించారు.

పెరిగిన జీవన భారం

గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో రైతులపై జీవన భారం పెరిగిందని, కార్మికులకు కూడా పనుల్లేక ఆదాయం పడిపోయిందని పయ్యావుల పేర్కొన్నారు. దిగువ స్థాయి వారికి గత ప్రభుత్వం ఇచ్చిన ప్రయోజనాల కన్నా తిరిగి లాగేసుకున్నదే ఎక్కువగా ఉందని, ఆదాయం కన్నా వారి ఖర్చులు గణనీయంగా పెరిగిపోయాయని అన్నారు.

పన్నుల్లో భారీ నష్టాలు

ఇప్పటి వరకు అనుసరించిన విధానాల వల్ల పన్నుల ఆదాయం తగ్గిపోయి పక్క రాష్ట్రాలకు ఆ ఆదాయం వెళ్లిపోయిందన్నారు. మన రాష్ట్రంలో కన్నా ఇతర రాష్ట్రాల్లో వాహనాల ధరలు తక్కువని, అందుకే అక్కడ కొనుగోళ్లు పెరిగి, మనకు టాక్స్ ఆదాయం పడిపోయిందన్నారు. ఫార్చ్యూనర్ కార్ తెలంగాణలో కొంటే ఇక్కడ రాష్ట్రానికి 17 లక్షల వరకు నష్టం వాటిల్లుతోందని, దీనిని నివారించేందుకు ఆలోచిస్తున్నామన్నారు. మన దగ్గర ద్విచక్ర వాహనాల అమ్మకాలూ పడిపోయాయన్నారు. చివరకు పెట్రోల్, డీజిల్ ధరలు కూడా కర్ణాటకలో తక్కువని, అందుకే రాష్ట్ర వాహనాలు కూడా అక్కడే ఇంధనాన్ని నింపుకుంటున్నాయని చెప్పారు. ఎంఎస్‌ఎంఇ పరిశ్రమలకూ నష్టాలేనని, ఇక్కడ ఉత్పత్తి ధరలు పెంచేయడం, పక్క రాష్ట్రాల్లో తక్కువగా ఉండడంతో రాష్ట్రంలో చిన్న పరిశ్రమలు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. అలాగే విజయవాడ చెప్పుల బిజినెస్‌కు ప్రాముఖ్యత కలిగిందని, కానీ పక్క రాష్ట్రాల నుంచి పన్నులు కట్టకుండా తీసుకొచ్చి ఇక్కడ అమ్మేయడం వల్ల మనకు పన్ను నష్టం వాటిల్లుతోందన్నారు.

పంచాయతీలకు రూ.250 కోట్లు విడుదల

ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా రూ.250 కోట్లను ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పంచాయతీలకు విడుదల చేశారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో తొలిఖారి బాధ్యతలు స్వీకరించిన ఆయన గురువారం ఈ నిధులు విడుదల చేస్తూ తొలి సంతకం చేశారు. ఇంకా చెల్లించాల్సింది చాలా ఉందని, వాటిని కూడా త్వరలో విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు.

'బ్రాండ్ చంద్రబాబు'తో అభివృద్ధి

ఇప్పుడున్న పరిస్థితుల్లో 'బ్రాండ్ చంద్రబాబు'తో ముందుకు వెళ్తామన్నారు. త్వరలోనే మన కాళ్లమీద మనం నిలబడే స్థాయికి చేరుకోవాలన్న లక్ష్యంతో సాగుతున్నట్లు పయ్యావుల పేర్కొన్నారు. ఇందుకోసం శక్తికి మించి శ్రమిస్తామన్నారు.

రాజధాని నిర్మాణంలో కీలకమైన
ఎడిసి, సిఆర్‌డిఎలో సిబ్బంది కొరత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాజధాని అమరావతి నిర్మాణంలో కీలకపాత్ర పోషించనున్న అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎడిసి), సిఆర్‌డిఎలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. రాజధానిలో అభివృద్ధి పనులన్నీ ఎడిసి చేపడుతుంది. రోజువారీ ఏర్పాట్లను సిఆర్‌డిఎ పర్యవేక్షిస్తుంది. ప్రస్తుతం ఉన్న అతికొద్దిమంది ఇంజినీర్లు ఎడిసి, సిఆర్‌డిఎలో ద్విపాత్రాభినయం చేస్తున్నారు.

2014 నుంచి 2019 వరకూ రాజధానిలో ప్రతి గ్రామానికి ఒక స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, ఒక ఎమ్మార్వో, ఇద్దరు డిప్యూటీ ఎమ్మార్వోలు ఉండేవారు. వారితోపాటు ఒక టెక్నికల్ అసిస్టెంటును నియమించారు. అలాగే ప్రతి ప్రాజెక్టుకూ ఒక ఇంజినీర్‌ను ఏర్పాటు చేశారు. ఎడిసిలోనూ ఒక చీఫ్ ఇంజినీరు, ఇద్దరు ఎస్ఇలు, నలుగురు ఇఇలు, 15 మంది వరకూ అసిస్టెంటు ఇంజినీర్లు ఉన్నారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత వీరందరినీ వారి మాతృసంస్థలకు పంపించేశారు. సిఆర్‌డిఎలో సిబ్బందినీ బదిలీ చేశారు. నేరుగా సిఆర్‌డిఎ నియమించుకున్న కొంతమంది సిబ్బందిని తొలగించారు. ఇప్పుడు ఏ పని చేయాలన్నా, చేపట్టాలన్నా ఇంజినీర్లు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. గతంలో ఇక్కడ పనిచేసి వెళ్లిన వారిని వెనక్కు పిలిపించుకునే పనిలో రెండు సంస్థలూ ఉన్నాయి. వారికైతే అవగాహన ఉంటుందని ఆలోచన చేస్తున్నారు. వారి మాతృ సంస్థల్లో జీతాలు, ఇక్కడకు వస్తే ఇచ్చే జీతాల్లో వ్యత్యాసం ఉండటం, మరలా గ్యారంటీగా ఉంచుతారా లేక తొలగిస్తారా అనే ఆందోళనతో వచ్చేందుకు ఎవరూ సంసిద్ధత వ్యక్తం చేయడం లేదని సమాచారం. పోస్టింగు కోసం ఎదురు చూస్తున్న, గతంలో ఇక్కడ కీలకస్థానాల్లో ఉన్న అతికొద్దిమంది ఇంజినీర్లు మాత్రం వ్యక్తిగతంగా దరఖాస్తులు సమర్పిస్తున్నారు.

అనుమతి కోసం ఎదురుచూపు

దరఖాస్తులు చేసుకున్న వారిలో ఎంతమందిని తీసుకోవాలి, బడ్జెట్ కేటాయింపులు ఎలా అనేది ఇంకా కొలిక్కిరాలేదు. ఐదేళ్ల క్రితం ఉన్న వేతనాల ప్రకారం ఇప్పుడు సిబ్బందిని తీసుకోవడం కష్టమవుతుంది. నియామకాల్లో ఇదో పెద్ద సమస్యగా మారిందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

రాజధాని అమరావతి రాష్ట్ర ప్రభుత్వ కీలక ప్రాజెక్టు కావడంతో నైపుణ్యం కలిగిన అధికారులను తీసుకోవాలనే ఆలోచనతో ఎడిసి ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి ఆలోచన చేస్తున్నారు. అలాగే సిఆర్‌డిఎలో కూడా పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఒక్కో ప్రాజెక్టుకు ఒక్కో ఎస్ఇ స్థాయి అధికారిని నియమించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.

778 పోస్టులకు 250 మంది

ఎపిసిఆర్‌డిఎ ఏర్పాటు సమయంలో ఐదు డిపార్టుమెంట్లు 21 డివిజన్లు, 42 సెక్షన్లకు గాను 778 పోస్టులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీటన్నిటిలో ప్రస్తుతం 250 మందికి మించి పనిచేయడం లేదు. ఎడిసిలో అయితే ఆఫీసు సిబ్బందిని మినహాయించి మిగిలిన ఇంజినీరింగ్ అధికారులు అందరినీ సిఆర్‌డిఎకు డిప్యూటేషన్‌పై పంపించారు. దీంతో అక్కడ పోస్టులు కూడా భర్తీ చేసుకోవాల్సి ఉంది.

ట్రిపుల్ ఐటి విద్యార్థుల ఎంపిక జాబితా విడుదల

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటిల్లోకి ఎంపికైన విద్యార్థుల జాబితాను ట్రిపుల్ ఐటి విసి కెసి.రెడ్డి గురువారం విడుదల చేశారు. నూజివీడులోని ట్రిపుల్ ఐటి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటిలకు 93 శాతం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుండి ఎంపికయ్యారని, మిగిలిన ఏడు శాతం ప్రయివేటు స్కూళ్ల నుంచి ఎంపికయ్యారని తెలిపారు.

రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటిల్లో సీట్లు ఈసారి అత్యధికంగా 67.15 శాతం బాలికలు, 32.85 శాతం బాలురు సాధించారని వివరించారు. మన రాష్ట్రం విద్యార్థులు 98 శాతం సీట్లు సాధించగా, తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుండి రెండు శాతం విద్యార్థులు సీట్లు సాధించారని చెప్పారు. ఈ నెల 22 నుండి 27వ తేదీ వరకు ట్రిపుల్ ఐటిల్లో కౌన్సెలింగ్‌లు సాగుతాయన్నారు. 22, 23 తేదీల్లో నూజివీడు క్యాంపస్, ఒంగోలు క్యాంపస్‌ల్లో, 24, 25 తేదీల్లో ఇడుపులపాయ ఆర్‌కె వ్యాలీ క్యాంపస్‌లో, 26, 27వ తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల క్యాంపస్‌లో కౌన్సెలింగ్‌లు జరుగుతాయని తెలిపారు. ఆగస్టు మొదటి వారం నుండి అన్ని ట్రిపుల్ ఐటిల్లో తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఇతర వివరాలు ఆర్‌జియుకెటి వెబ్‌సైట్‌లో ఉంటాయని వివరించారు.

స్టడీ సర్కిళ్లను పునరుద్ధరించాలి

మంత్రి కి కెవిపిఎస్ వినతిపత్రం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో స్టడీ సర్కిల్స్‌ను పునరుద్ధరణ చేయాలని కెవిపిఎస్ రాష్ట్రప్రభుత్వాన్ని కోరింది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామిని సచివాలయంలో గురువారం కలిసి కెవిపిఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. ఎస్సి,ఎస్టి, బిసి మైనార్టీ నిరుద్యోగ యువతీ, యువకులకు పోటీ పరీక్షలకు శిక్షణ పొందేందుకు హాస్టల్‌తో కూడిన ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన మెగా డిఎస్సి నోటిఫికేషన్ కోసం ప్రభుత్వం తొలి సంతకాన్ని పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి జిల్లాలో అంబేద్కర్,మహాత్మ జ్యోతిబాపూలే స్టడీ సర్కిళ్లు పునరుద్ధరించి శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజనుల కోసం విశాఖపట్నం లేదా విజయవాడలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని తెలిపారు. గత ప్రభుత్వం స్టడీ సర్కిళ్లను పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. గిరిజనుల కోసం విశాఖపట్నం లేదా విజయవాడలో ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని తెలిపారు.ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పోటీ పరీక్షల్లో ఎంపికైన వారికి స్టైఫండ్ ఇవ్వాలని తెలిపారు. గ్రూప్-1,2తో పాటు ఇతర ఉద్యోగ నియామకాలను ప్రకటించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అంద్ర మాల్యాద్రి, ఓ నల్లప్ప, నాయకులు దడాల సుబ్బారావు, బి రఘురామ్, ఎండి ఆనంద్, కె క్రాంతిబాబు తదితరులు ఉన్నారు.

ఐఎఎస్ అధికారుల బదిలీలు ఇలా...

అధికారి పేరు	నియమిత స్థానం
1. జి.అనంతరాము	అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
2. ఆర్.పి.సిసోడియా	స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
3. జి.జయలక్ష్మి	చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్
4. కాంతిలాల్ దండే	ఆర్‌అండ్‌బి ముఖ్య కార్యదర్శి
5. ఎం.గిరిజాశంకర్	ఛీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్
6. సురేష్‌కుమార్	పెట్టుబడులు మౌలిక సదుపాయాలశాఖ కార్యదర్శి, గ్రామవార్డు సచివాలయాల పూర్తి అదనపు బాధ్యతలు, జిఎడి కార్యదర్శి
7. సౌరబ్‌గౌర్	ఐటిశాఖ, ఆర్‌టిజిఎస్ కార్యదర్శి, స్కిల్ డెవలప్‌మెంట్ అదనపు బాధ్యతలు
8. ఎన్.యువరాజు	పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్‌శాఖ కార్యదర్శి
9. హర్షవర్ధన్	మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి
10. పి.భాస్కర్	బిసి సంక్షేమశాఖ కార్యదర్శి, ఇడబ్ల్యుఎస్, జిఎడి సర్వీసెస్ అదనపు బాధ్యతలు
11. కె.కన్నబాబు	సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి, గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు
12. వి.వినయ్‌చంద్	పర్యాటకశాఖ కార్యదర్శి
13. వివేక్‌యాదవ్	యువజన సర్వీసులు, క్రీడలశాఖ కార్యదర్శి
14. సూర్యకుమారి	మహిళా శిశు సంక్షేమం, వికలాంగుల సంక్షేమశాఖ కార్యదర్శి
15. సి.శ్రీధర్	పరిశ్రమలశాఖ డైరెక్టర్
16. జె.నివాస్	ఆర్థికశాఖ కార్యదర్శి
17. విజయరామరాజు	పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్
18. హిమాన్షు శుక్ల	సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టర్
19. ఢిల్లీ రావు	వ్యవసాయశాఖ డైరెక్టర్

2011 భూ అధీకృత రైతుల చట్టాన్ని పునరుద్ధరించండి

- ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కౌలు రైతులకు భద్రత కల్పించేలా 2011 భూ అధీకృత రైతుల చట్టాన్ని పునరుద్ధరించాలని ఎపి కౌలురైతు సంఘం కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, నాయకులు పంచకర్ల రంగారావు, బైరుగాని శ్రీనివాసరావు, సిహెచ్ సైదులు, టివి లక్ష్మణస్వామి గురువారం వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011లో కౌలురైతులకు రక్షణ, భద్రత కల్పించేందుకు భూ అధీకృత రైతుల చట్టాన్ని తీసుకొచ్చారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం భూ అధీకృత కౌలురైతుల చట్టాన్ని రద్దు చేసి, ఆంధ్రప్రదేశ్ పంటల సాగుదారుల హక్కు చట్టాన్ని తెచ్చారని అన్నారు. ఈ చట్టం ప్రకారం భూమి యజమాని సంతకం చేస్తేనే కౌలురైతుగా గుర్తించేలా నిబంధన పెట్టారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇ-క్రాప్‌ను కౌలురైతుల పేరుమీదే చేయాలని, పెట్టుబడి సాయం కింద ఇచ్చే రూ.20 వేలను కౌలురైతులకే అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పంట రుణాలు, పంటనష్ట పరిహారం, పంటల బీమా వంటివి కూడా కౌలు రైతులకే నేరుగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్

- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సాంఘిక సంక్షేమశాఖ అధికారులకు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సూచించారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ఉద్యోగాల నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదిదర అంశాలపై సచివాలయంలో గురువారం అధికారులతో చర్చించారు. బాధ్యతతో వ్యవహరించి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ప్రజలు నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలని చెప్పారు. ఆ ఫిర్యాదు ఏ స్థాయిలో ఉందో తెలుసుకుని వారికి సమాచారం అందించేలా ఉండాలని ఆదేశించారు. ఉద్యోగుల సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని అన్నారు. ఈ సమీక్షలో సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కె హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆఫీసుపై దాడి కేసులో కఠిన చర్యలొద్దు

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి ఆఫీసుపై 2021లో దాడి చేశారనే కేసులో వైసిపి ప్రభుత్వంలో సలహాదారుగా చేసిన సజ్జల రామకృష్ణారెడ్డి, ఆ పార్టీ ఎమెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, పార్టీ నేత దేవినేని అవినాష్‌కు హైకోర్టు ఊరట లభించింది. తిరిగి విచారణ జరిగే వరకు వారిపై పోలీసులు ఏవిధమైన తొందరపాటు, కఠిన చర్యలు తీసుకోరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను ఈ నెల 16కు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ విఆర్ కృపాసాగర్ ఆదేశాలు జారీ చేశారు. టిడిపి ఆఫీసుపై దాడి ఘటనలో పోలీసులు కొందరిని అరెస్టు చేశారు. తమను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వారంతా హైకోర్టులో వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు. వారి తరపున సీనియర్ అడ్వకేట్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. ఈ కేసులో ఎజి వాదిస్తారని, ఎజికి జ్వరం వచ్చిందని, ఈలోగా పిటిషనర్ల వాదనలు చేసేందుకు అనుమతించాలని గవర్నమెంట్ స్పెషల్ ప్లీడర్ సింగమనేని ప్రణతి కోరారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. ఇరుపక్షాల వాదనలు ఒకేసారి వింటామని స్పష్టం చేసింది. పొన్నవోలు కల్పించుకుని, పిటిషనర్లను అరెస్టు చేయకుండా రక్షణ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అరెస్టు భయమే అవసరం లేదని ప్రణతి చెప్పడంతో న్యాయమూర్తి కల్పించుకుని తదుపరి విచారణ వరకు ఆ మేరకు ఉత్తర్వులు ఇస్తామన్నారు. తదుపరి విచారణ వరకు పిటిషనర్ల విషయంలో ఎలాంటి తొందరపాటు, కఠిన చర్యలు తీసుకోరాదని పోలీసులకు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే చంద్రబాబు విపక్ష నేతగా ఉండగా ఆయన ఇంటి వద్ద గొడవ చేశారనే కేసులో వైసిపి నేత, మాజీ మంత్రి జోగి రమేష్ విషయంలో కూడా పోలీసులు తొందరపాటు, కఠిన చర్యలు తీసుకోరాదని ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో విచారణ ఈ నెల 16కు వాయిదా వేశారు.

డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి నారాయణ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

డయేరియా పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులపై ప్రజల్లో చైతన్యం తీసుకురాలని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరి నారాయణ అన్నారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలోని లెనిన్ నగర్, మారుతి నగర్‌లో మంత్రి నారాయణ గురువారం పర్యటించారు. డయేరియా ప్రబలిన ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించి బాధితులను పరామర్శించారు. అనంతరం ఆర్‌అండ్‌బి బంగ్లాలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలోని లెనిన్ నగర్, మారుతి నగర్‌లలో ఇప్పటి వరకూ 60 డయేరియా కేసులు నమోదయ్యాయని తెలిపారు. ప్రస్తుతం 39 మంది వివిధ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని, వారి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. కృష్ణా నది నుండి తాగు నీరు అందించేందుకు 16 కిలో మీటర్ల పైప్‌లైన్ ఉందని, మరమ్మతుల నిమిత్తం ఐదు రోజులపాటు నీటిని నిలిపివేశారని చెప్పారు. ఆ సమయంలో బోరు నీటిని వాడారని తెలిపారు. ఒక బోరులో నైట్రేట్ ఉన్నట్లు అధికారులు పరీక్షల్లో గుర్తించారని అన్నారు. ప్రస్తుతం కృష్ణ పైప్‌లైన్ ద్వారా తాగు నీరు అందిస్తున్నామని, అయినా కేసులు వస్తున్నాయని చెప్పారు. నీటిని పరీక్షల కోసం విజయవాడ ల్యాబ్‌కు పంపించామని, త్వరలో రిపోర్టులు వస్తాయని తెలిపారు. పట్టణ ప్రజలు మంచినీటిని కాచి చలార్చి తాగాలని సూచించారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. మరో రెండు రోజుల్లో మరోసారి పిడుగురాళ్లకు వచ్చి పరిశీలన చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఆర్‌డిఓ రవికాంత్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

రక్షణలేని జీవితాలు

- పెరుగుతున్న పారిశ్రామిక ప్రమాదాలు
- ఫార్మా కంపెనీల్లోనే అధికం

అది 2020 సంవత్సరం మే నెల 7వ తేది! విశాఖపట్నంలోని ఎల్జీ పాలిమర్స్ విషం చిమ్మిన రోజది! ఫ్యాక్టరీ నుండి లీకైన విషవాయువుతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. పరుగు తీస్తూనే కొందరు ప్రాణాలు వదిలారు. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మరణించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో ముగ్గురు తుది శ్వాస విడిచారు. 600 మంది ఆస్పతి పాలయ్యారు. కొందరు ఇప్పటికీ విషవాయువు దుష్ ప్రభావాలను అనుభవిస్తూనే ఉన్నారు. దశాబ్దాల నాటి భోపాల్ ఘటనను తలపించిన ఈ ప్రమాదం గుర్తుంది కదూ! ఈ సంఘటనలో సాధారణ ప్రజలు కూడా బాధితులుగా మారిన ఆ సంఘటన నుండి పాఠాలు నేర్చుకోకపోవడంతో రాష్ట్రంలో పారిశ్రామిక ప్రమాదాల సంఖ్య పెరుగుతూనేఉంది. ఆ ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోతున్న కార్మికుల సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది.

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎల్జీ పాలిమర్స్ ఘటన జరిగిన మూడు నెలల్లోనే హిందూస్తాన్ షిప్‌యార్డ్‌లో క్రేన్ పడి 11 మంది కార్మికులు మరణించారు. 2022 ఏప్రిల్‌లో ఏలూరు ఫోరస్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో 6గురు చనిపోయారు. తాజాగా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడలోని అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలో మరో ఇద్దరు కార్మికులు మృతిచెందగా 13 మంది ఆస్పత్రిపాలు కావడంతో ఈ అంశం చర్చనీయాంశగా మారింది.

ఎన్ని ప్రమాదాలు ...?

2021 నుంచి 2023 జూన్ వరకు కేవలం అనకాపల్లి జిల్లాలోనే 27 పారిశ్రామిక ప్రమాదాలు జరిగాయి, వాటిలో ఫార్మా కంపెనీల్లో జరిగిన ప్రమాదాలే 16 ఉన్నాయి. ఇతర పరిశ్రమల్లో 11 ప్రమాదాలు జరిగాయి. ఫార్మా పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో 21 మంది మృతి చెందగా, 12 మంది గాయపడ్డారు. ఇతర పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో ఏడుగురు మరణించగా, నలుగురు క్షతగాత్రులయ్యారు.

ఫార్మా కంపెనీల్లోనే ఎక్కువ...

ఇతర పరిశ్రమలతో పోలిస్తే ఫార్మా కంపెనీల్లోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. అనకాపల్లి జిల్లాలో జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే ప్రతి రెండు నెలలకొక్కసారి ఏదో ఒక కంపెనీలో కెమికల్స్ ప్రమాదం జరుగుతోంది. కేవలం రెండేళ్లల్లోనే ఈ జిల్లాలో 16 ప్రమాదాలు జరిగి 21 మంది కార్మికులు మృతిచెందారు. 2021లో ఆరు ప్రమాదాలు జరగ్గా 5గురు, 2022లో ఐదు ప్రమాదాల్లో 9 మంది, 2023 జూన్ వరకు ఐదు ప్రమాదాలు జరగ్గా 7గురు మృతిచెందారు. ఇతర పరిశ్రమల్లో ఈ కాలంలో 11 ప్రమాదాలు జరగ్గా ఏడుగురు మణించారు.

ఎందుకీ పరిస్థితి ...

పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల గల కారణాలపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించడం లేదు. కార్మికుల భద్రతకు యాజమాన్యాలు సరైన భద్రత తీసుకోకపోవడంతో పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో పరిశ్రమలకు అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్న ప్రభుత్వం, యాజమాన్యాలు కార్మికులకు రక్షణ చర్యలు తీసుకుంటున్నాయా? లేదా? అనే అంశాలను పరిశీలించడం లేదని చెబుతున్నారు. కార్మికులకు భద్రత కల్పించడాన్ని యాజమాన్యాలు భారంగా భావిస్తున్నాయని అంటున్నారు. దీంతో రక్షణ చర్యలు తీసుకోవడం లేదని, ఫలితంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ లీకైన సంఘటనలో కనీసం అలారం కూడా మోగలేదంటే కార్మికుల రక్షణ కోసం యాజయాన్యాలు తీసుకుంటున్న చర్యలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. 2022లో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం బ్రాండిక్స్ కంపెనీలో రెండు నెలల వ్యవధిలోనే రెండు సార్లు విషవాయువులు లీకై 539 మంది కార్మికులు ఆస్పత్రి పాలయ్యారు.

ఫార్మా పరిశ్రమల్లో జరిగిన పెద్ద ప్రమాదాలు

జిల్లా	కంపెనీ పేరు	ప్రమాదం తేదీ	మృతులు	క్షతగాత్రులు
విశాఖపట్నం	ఎల్జీ పాలిమర్స్	2020 మే 7	12	600
విశాఖపట్నం	లారెన్	2022 డిసెంబర్ 26	5	-
విశాఖపట్నం	సాహితి ఫార్మా	2023 జూన్ 6	6	1
ఇతర పరిశ్రమల్లో జరిగిన పెద్ద ప్రమాదాలు				
విశాఖపట్నం	హిందూస్తాన్	2020 ఆగస్టు 1	11	-
ఏలూరు	ఫోరస్	2022 ఏప్రిల్ 14	6	12
అనకాపల్లి	బ్రాండిక్స్	2022 జూన్,ఆగస్టు	-	539
ఎన్టీఆర్	అల్ట్రాటెక్	2024 జులై 7	2	13

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి : టిఎన్‌యుఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం(టిఎన్‌యుఎస్) కోరింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్న జివో 117ను రద్దు చేసి విద్యా వ్యవస్థని కాపాడాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను విడదీయడం వల్ల ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలుగా మారాయని తెలిపారు. వీటిని మరలా ప్రాథమిక పాఠశాలల్లో కలిపాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్లంతో పాటు తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలని తెలిపారు. 2003 డిఎస్సి వారికి ఓపిఎస్ అమలు చేయాలని కోరారు. పాఠ్యపుస్తకాలు తరచు మార్చడం వల్ల విద్యార్థుల్లో గందరగోళ పరిస్థితి ఉందని, సిలబస్ అమలుపై దీర్ఘకాలిక నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులకు యాప్‌ల ఒత్తిడి తగ్గించాలని కోరారు. హైస్కూళ్లల్లో రద్దు చేసిన గ్రేడ్-2 హెచ్‌ఎం, పిడి పోస్టులను పునరుద్ధరించాలని కోరారు. జివో 302 ప్రకారం అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్కరర్లుగా పదోన్నతి కల్పించాలని తెలిపారు. 1996 డిఎస్సిలో ఉన్న 133 మందిని ఎంటిఎస్‌లో నియమించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రజనీబాబు నాయుడు, చిగురుపాటి పినాకపాణి ఉన్నారు.

తల్లికి వందనం పేరుతో మోసం

- ప్రతి విద్యార్థికీ ఇచ్చేలా జిఓను సవరించాలి
- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమ్మకు వందనం పేరుతో ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు అదే తల్లిని మోసం చేస్తూ ఒక్కరికే పథకాన్ని పరిమితం చేయడం సరైంది కాదని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం జిఓను సవరించాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రజలను మభ్యపెట్టేలా ఆచరణ సాధ్యంకాని హామీలివ్వడం, ఆ తర్వాత అన్నీ ఎగ్గొట్టడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని విమర్శించారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, నిమ్మల రామానాయుడు కూడా ఇంట్లో ఎంతమంది చదువుతుంటే వారందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని అన్నారని, ఇప్పుడు ఒక్కరికే పరిమితం చేయడం సరికాదని అన్నారు.

పార్టీ కోసం పని చేస్తే సస్పెండ్ చేశారు..!


- మాజీ ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

'కదిరి నియోజకవర్గంలో కుక్కలు చింపిన విస్తరిలా ఉన్న వైసిపిని ఏకతాటిపైకి తెచ్చాను. కనీసం పార్టీ సమన్వయకర్తగా ఎవ్వరూ రాని సమయంలో నేను ముందుకొచ్చి కార్యకర్తలకు భరోసా ఇచ్చాను. పదేళ్లపార్టీ కోసం పని చేస్తే సస్పెన్షన్‌ను బహుమతిగా ఇచ్చారు' అంటూ కదిరి వైసిపి మాజీ ఎమ్మెల్యే పివి.సిద్ధారెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారంటూ సిద్ధారెడ్డిని వైసిపి నుంచి సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కదిరిలోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసిపికి వ్యతిరేకంగా తానూ ఏ రోజూ ప్రవర్తించలేదన్నారు. ఓ వైపు పార్టీని బలోపేతం చేస్తూనే మరోవైపు కదిరి నియోజవకర్గం అభివృద్ధికి కృషి చేశానని తెలిపారు. కదిరికి సంబంధం లేని వ్యక్తిని తీసుకొచ్చి 2024లో అభ్యర్థిగా ప్రకటించినా తానెప్పుడు ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కదిరికి వచ్చి కనీసం తనను మాటమాత్రమైనా జగన్‌మోహన్‌రెడ్డి పలకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనను ఎన్ని రకాలుగా అవమానపరిచినా పార్టీ గురించి ఇప్పటి వరకు ఏనాడూ తప్పుగా మాట్లాడలేదన్నారు. ఇంత కాలం పార్టీ అభివృద్ధి కోసం పని చేసి, ఏ తప్పు చేయని తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం తగదన్నారు. తన భవిష్యత్తు రాజకీయ నిర్ణయాన్ని కుటుంబ సభ్యులు, మిత్రులతో చర్చించి త్వరలోనే ప్రకటిస్తానని తెలిపారు.

ప్రయివేట్‌కు పోర్టులు!

- కార్గో టెర్మినల్స్, పోర్టు స్థలాల అమ్మకానికి కేంద్రం తహతహ
- 25, 26 తేదీల్లో దేశ వ్యాపిత సమ్మెకు పోర్టు, డాక్ కార్మికులు సన్నద్ధం



ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కారు పోర్టుల ఆస్తుల అమ్మకానికి, కార్గో టెర్మినర్లను ప్రయివేట్ వాళ్లకు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తోంది. దేశంలోని తొమ్మిది తీర ప్రాంత రాష్ట్రాల్లోని 7,517 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న పోర్టుల కార్యకలాపాలను ప్రయివేట్ వాళ్ల చేతుల్లోకి వెళ్లనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీనికి వ్యతిరేకం పోర్టు, డాక్ కార్మికులు సమ్మెకు సన్నద్ధం అవుతున్నారు. దేశంలోని సముద్ర తీర ఆర్థిక ప్రయోజనాలకు నష్టం చేసే 2021 మేజర్ పోర్టు అథారిటీ చట్టాన్ని పోర్టులపై ప్రయోగించడానికి కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. 'ల్యాండ్ లార్డ్ పోర్టు మోడల్‌ను అమలు చేస్తూ పోర్టుల ఆస్తులను మానిటైజేషన్ చేయాలంటూ పోర్టులపై మెడపై కత్తి పెడుతోంది. కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జల మార్గాల మంత్రిత్వ శాఖ ఇటీవల ఢిల్లీలో సమావేశం నిర్వహించి ఈ చర్యలను వేగవంతం చేయాలంటూ దేశంలోని 12 మేజర్ పోర్టులను ఆదేశించింది. దేశంలోని ఓడరేవులన్నింటా ఈ పనులు శరవేగం చేయాలని ఉత్తర్వులు వచ్చాయి. ఈ నేపథ్యంలో విశాఖపట్నం పోర్టులోని అధికార యంత్రాంగంలో 'ల్యాండ్ లార్డ్ పోర్టు' మోడల్ పనులకు సంబంధించిన ఫైళ్లు కదులుతున్నాయి. పోర్టులోని 21 కార్గో హేండ్లింగ్ టెర్మినల్స్‌లో ఇప్పటికే సగం మేర ప్రయివేట్ ఆపరేటర్లకు కట్టబెట్టారు. గతంలోనే శాలిగ్రాంపురంలోని పోర్టుకు చెందిన 17 ఎకరాలను రహేజా ఇనార్బిట్ మాల్‌కు కట్టబెట్టగా, పోర్టు ఇండోర్ స్టేడియాన్ని ప్రయివేట్ నిర్వహణకు అప్పగించారు.

సమ్మెకు పిలుపునిచ్చిన డబ్ల్యుటిడబ్ల్యుఎఫ్ఐ సమావేశం

ప్రయివేటీకరణ నేపథ్యంలో వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుటిడబ్ల్యుఎఫ్ఐ) ఈ నెల 4, 5 తేదీల్లో కొల్‌కతాలో సమావేశమైంది. 12 ప్రధాన ఓడరేవుల్లో ట్రేడ్ యూనియన్లను ఐక్యం చేసి ఈ నెల 25, 26 తేదీల్లో పోర్టుల్లో సమ్మెకు పిలుపునిచ్చింది. కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తలపెట్టిన ప్రయివేటీకరణ, ఆస్తుల అమ్మకానికి వ్యతిరేకంగా ఓడరేవు (పోర్టు)లు, డాక్ కార్మికుల సమ్మె ద్వారా నిరసన తెలపాలని ఆ సమావేశం నిర్ణయించింది. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన ఎన్‌డిఎ ప్రభుత్వం నేషనల్ అసెట్ మానిటైజేషన్ ప్లాన్ (ఎన్ఎఎంపి) అమలుకు చర్యలను వేగవంతం చేస్తూ 'భూస్వామి పోర్టు మోడల్'గా మార్చేందుకు అధికారులపై ఒత్తిడి పెంచిందని విశాఖ పోర్టుకు చెందిన ఉద్యోగ సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. ఇప్పటికే విశాఖపట్నం, చెన్నయ్, ముంబయి, కొచ్చిన్, కొల్‌కతా వంటి ప్రధాన ఓడరేవుల్లో ప్రయివేట్ పోర్టు ఆపరేటర్ల గుత్తాధిపత్యంతో ఉద్యోగులు, కార్మికులు నలిగిపోతున్నారు. ఇటీవల డబ్ల్యుటిడబ్ల్యుఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.నరేంద్రరావు చెన్నయ్‌లో మీడియాతో మాట్లాడుతూ 'పోర్టుల్లో ఆస్తుల వివరాలపై కేంద్రం ఆరా తీస్తోందని, స్థలాలను లెక్కకట్టి లీజులకివ్వడం, కార్గో హ్యాండ్లింగ్ బెర్తులను ప్రయివేట్ ఆపరేటర్లకు పిపిపి కింద ఇవ్వడం వంటి చర్యలకు అధికారులను సన్నద్ధం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు పోర్టులను ధారాదత్తం చేసే పనిని మోడీ సర్కారు చేయడంపై ఆయన మండిపడ్డారు.



సంక్షేమ పథకాలు వర్తింపజేయండి

- ఎపిఎస్‌ఆర్‌టిసి రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రిటైర్డు ఆర్‌టిసి ఉద్యోగులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని ఎపిఎస్‌ఆర్‌టిసి రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు రాష్ట్ర మానవ వనరులు, విద్య, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్‌ను అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల గంగాధర్, ఉపాధ్యక్షులు కె కోటేశ్వరరావు, నాయకులు బిడిఆర్ రెడ్డి, రామచంద్రరావు, వెంకటేశ్వరరావు కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఆర్‌టిసి ఉద్యోగులు రిటైర్డు అయ్యాక సరైన పెన్షన్ సౌకర్యం లేకపోవడంతో దుర్భర జీవితాన్ని గడపాల్సి వస్తోందని వివరించారు. కనీసం రిటైర్డు ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తే కొంతమేలైనా జరుగుతుందని వివరించారు. సామాజిక వృద్ధాప్య పెన్షన్, తెల్లరేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని కోరారు. ఇందుకు నారా లోకేష్ స్పందిస్తూ.. సంబంధితశాఖ మంత్రితో మాట్లాడి తప్పనిసరిగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

బాలిక హంతకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -రాంబిల్లి (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కుప్పగుండుపాలెంలో ఈ నెల ఆరున బాలికను హత్య చేసి పరారైన నిందితుడు బి.సురేష్ (26) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు..హత్య అనంతరం నిందితుడు గ్రామం దాటి వెళ్లిపోయాడు. పోలీసులు 12 బృందాలతో గాలింపు చేపట్టారు. హత్య సంఘటనా స్థలంలో లభ్యమైన లెటర్ ఆధారంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడేమో అన్న అనుమానంతో డ్రోన్ కెమెరాలతోనూ గాలించారు. నాలుగు రోజులు గడిచిపోయినప్పటికీ ఆచూకీ దొరకలేదు. పొలంలో దుర్వాసన రావడాన్ని గురువారం తెల్లవారుజామున స్థానిక రైతులు గమనించి, పరిశీలించారు. సురేష్ మృతి చెంది ఉండటంతో పోలీసులకు సమాచారమందించారు. హత్య జరిగిన ఇంటికి సుమారు 200 మీటర్లు దూరంలో కొబ్బరి తోటకు ఆనుకొని ఉన్న గడ్డిమడిలో సురేష్ మృతదేహం లభ్యమైంది. నిందితుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని, ఈ ఘటన రెండు మూడు రోజులు ముందే జరిగి ఉండవచ్చని, అందువల్లే మృతదేహం నుంచి దుర్వాసన వస్తోందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వ్యవసాయ కనెక్షన్‌లకు మీటర్లపై సిఎం చంద్రబాబు వైఖరి సరికాదు

- జిఓ 22ను రద్దు చేయాలి
- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు మీటర్లు పెట్టే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దాటవేత వైఖరితో వుండటం తగదని ఎపి రైతు సంఘం అసంతృప్తి వ్యక్తం చేసింది. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే జిఓ 22ను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేసే అంశంలో ట్రూ అప్ ఛార్జీలు, వ్యవసాయ కనెక్షన్‌లకు మీటర్ల సమస్యపై ప్రభుత్వం వైఖరిని స్పష్టంగా ప్రకటించకపోవడం సరైందికాదన్నారు. రాష్ట్రంలో 18 లక్షల వ్యవసాయ కనెక్షన్‌లు వున్నాయని తెలిపారు. ఈ కనెక్షన్‌లు ఎక్కువగా వెనుకబడిన రాయలసీమ జిల్లాల్లోనూ, ఇతర జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల్లో వున్నాయని అన్నారు. వ్యవసాయ కనెక్షన్‌లకు మీటర్లను పెడితే పగలగొట్టమని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో పిలుపునిచ్చారని, అలాగే టిడిపి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా హైకోర్టులో కేసును కూడా వేశారని గుర్తుచేశారు. స్మార్ట్ మీటర్లు రైతులు, ప్రజల కోసం తెచ్చినవి కాదని, కేంద్ర ప్రభుత్వ ఆదేశంతో, అదానీ, షిర్డీ సాయి కంపెనీల ప్రయోజనాల కోసం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిందని విమర్శించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ చారిత్రక అవసరమని, దాన్ని కొనసాగించకుండా డొంక తిరుగుడుగా రైతులపై విద్యుత్ భారం మోపితే ఎపి రైతు సంఘం ప్రతిఘటిస్తుందని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రజలపై రూ.17 వేల కోట్లు ట్రూ అప్ ఛార్జీల రికవరీ భారాన్ని ముఖ్యమంత్రి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు మూడో దశ సంస్కరణల పేరిట గత ప్రభుత్వ విధానాలను ముందుకు తీసుకెళ్లే ప్రమాదం కనిపిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా విద్యుత్ రంగంలో విధానాలను రూపొందించాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు

- లభ్యం కాని బాలిక మృతదేహం

ప్రజాశక్తి - పగిడ్యాల

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ఎల్లాల గ్రామానికి చెందిన బాలిక మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్, ర్యాంపు కెనాల్‌లో గురువారం ఎన్‌డిఆర్ఎఫ్ బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఎత్తిపోతల పథకం సమీపంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్ రాజకుమారి సంఘటన స్థలాన్ని సందర్శించారు. "మా పాపని చంపి ఇక్కడనే వేశారా? మరొక చోట వేశారా? మా పాప మృతదేహాన్నైనా మాకు ఇప్పించండి" అని కలెక్టర్ ముందు మృతురాలి కుటుంబసభ్యులు వాపోయారు. పోలీసులతో విచారణ చేపడుతున్నామని, మృతదేహం కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారని కలెక్టర్ అన్నారు. ఇలాంటివి మరలా పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్‌తో పాటు నంద్యాల జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి, డిఎస్‌పి శ్రీనివాసరావు, ఆర్‌డిఓ దాస్ ఉన్నారు.

వాసంతి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు, నాయకులు పకీర్ సాహెబ్, గోపాలకృష్ణ, బెస్త రాజు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో ముచ్చుమర్రి గ్రామంలో కలెక్టర్ రాజకుమారికి, డిఎస్‌పి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు.

దేశంలోనే తొలి టూరిజం ఇండెక్స్ ఫండ్

- టాటా ఎంఎఫ్ ఆవిష్కరణ

ముంబయి : మ్యూచువల్ ఫండ్ సంస్థ టాటా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ దేశంలోనే తొలి సారి టూరిజం ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. నిఫ్టీ 500లోని కంపెనీలు ఇందులో భాగంగా ఉంటాయి. ఈ ఫండ్ జులై 19 వరకు తెరవబడి ఉంటుందని ఆ కంపెనీ తెలిపింది. ఆ తర్వాత తిరిగి కొనుగోళ్లకు జులై 29 నుంచి అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. టాటా నిఫ్టీ ఇండియా టూరిజం ఇండెక్స్ ఫండ్‌లో 17 స్టాక్స్ ఉన్నాయి. ఈ ఎన్ఎఫ్ఒలో కనీస పెట్టుబడిని రూ.5,000గా నిర్ణయించింది.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించొద్దు

- సిపిఎం ఆధ్వర్యంలో పలుచోట్ల నిరసనలు



భీమవరంలో ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లాలో పలుచోట్ల గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. విశాఖ ఉక్కుపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వైఖరిని ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. భీమవరం, ఆకివీడు, తణుకు, తాడేపల్లిగూడెంల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. భీమవరంలో సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు తెలుగుజాతి హక్కు అని స్పష్టం చేశారు. దీన్ని ప్రయివేటీకరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి విశాఖపట్నంలోని స్టీల్‌ప్లాంటును సహాయ మంత్రి శ్రీనివాసవర్మతో కలిసి సందర్శించడం వెనుక ఆంతర్యమేమిటో తెలపాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెంలో పోలీస్ ఐల్యాండ్ వద్ద, ఆకివీడులో గాంధీబొమ్మ సెంటర్‌లో, తణుకులో వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో నిరసనలు తెలిపారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను తక్షణం ఆపాలని, విశాఖ ఉక్కుకు ప్రత్యేకంగా గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గెలాక్సీ జడ్ ఫోల్డ్ 6 ఫోన్ల విడుదల

- ధర రూ.2 లక్షలు పైనే..



పారిస్ : దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల దిగ్గజం సామసంగ్ గురువారం మార్కెట్లోకి కొత్త గెలాక్సీ జడ్ ఫోల్డ్ 6 పేరుతో కొత్త మడత ఫోన్‌లను విడుదల చేసింది. పారిస్‌లో జరిగిన సామ్‌సంగ్ గ్యాలక్సీ అన్‌ప్యాక్డ్ ఈవెంట్లో వీటిని ఆవిష్కరించింది. ఈ ఫోల్డెబుల్ ఫోన్‌లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన ఫీచర్లను అందిస్తున్నట్లు పేర్కొంది. భారత్‌లో గెలాక్సీ జడ్‌ఫ్లిప్6లో 12జిబి రామ్, 256జిబి స్టోరేజ్ వేరియంట్ ధరను రూ.1,09,999గా, 12జిబి, 512 జిబి ధరను రూ.1,21,999గా ప్రకటించింది. జడ్ ఫోల్డ్ 6 వేరియంట్‌లో 12జిబి, 256జిబి ధరను రూ.1,64,999గా, 12జిబి, 512 స్టోరేజ్ వేరియంట్ ధరను రూ.1,76,999గా, 12జిబి, 1టిబి స్టోరేజ్ ధరను ఏకంగా రూ.2,00,999గా నిర్ణయించింది. ఆండ్రాయిడ్ 14 ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేసే ఈ ఫోన్‌లలో ఏడేళ్ల పాటు అప్‌డేట్‌లను అందించనుంది. 50 ఎంపి, 12 ఎంపి, 10 ఎంపితో కూడిన ట్రిపుల్ కెమెరా సెటప్ రెయిర్ కెమెరాలను అమర్చింది. 10 మెగాపిక్సెల్స్‌తో కూడిన ఫ్రంట్ కెమరాను.. అలాగే అండర్ డిస్‌ప్లేలో 4 ఎంపి కెమెరాను కలిగి ఉంది.

ఎర్రచందనం దొంగలను వదిలేది లేదు

- కేంద్రమంత్రి బండి సంజయ్

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి ఆస్తులను కాజేసిన నయవంచకులను జనం తరిమికొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ...ఎపిలో గత ప్రభుత్వ పాలకులు వీరప్పన్ వారసులని, వారు ఎర్రచందనం పేరుతో జాతీయ సంపదను దోచుకున్నారని ఆరోపించారు. ఈ డబ్బుతో రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారన్నారు. ఎర్రచందనం దొంగలను వదిలిపెట్టేది లేదన్నారు. శ్రీవారి నిధులను పక్కదారి పట్టించి తిరుమలను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని విమర్శించారు. త్వరలోనే వారికి శిక్ష పడుతుందన్నారు.

18న ఆన్‌లైన్‌లో సేవా టికెట్లు

ఈ నెల 18 నుంచి అక్టోబర్ నెల దర్శన టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టిటిడి ఓ ప్రకటనలో పేర్కొంది. నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు అన్నప్రసాద సముదాయంలో యంత్రాల ఆధునీకీకరణ, ఉద్యోగుల సంఖ్యను పెంచుతామన్నారు. తిరుమలలో రద్దీ సాధారణంగా నెలకొందని, 14 కంపార్టుమెంట్లలో యాత్రికులు వేచి ఉన్నారని పేర్కొంది. టోకెన్ లేని యాత్రికులకు సర్వ దర్శనానికి 18 గంటల సమయం పడుతోందని తెలిపింది. బుధవారం శ్రీవారిని 73, 353 మంది దర్శించుకోగా..28, 444 మంది తలనీలాలు సమర్పించారు. హుండీ ఆదాయం రూ. 3.05 కోట్లుగా నమోదు అయింది.

టిసిఎస్‌కు రూ.12,040 కోట్ల లాభాలు



ముంబయి : దేశంలోనే అతిపెద్ద ఐటి సేవల కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 8.7 శాతం వృద్ధితో రూ.12,040 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.11,120 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ1లో టిసిఎస్ రెవెన్యూ 5.4 శాతం పెరిగి రూ.62,613 కోట్లకు చేరింది. రూపాయి ముఖ విలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.10 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను చెల్లించడానికి టిసిఎస్ బోర్డు ఆమోదం తెలిపింది. గడిచిన త్రైమాసికంలో కొత్తగా 5,452 మంది ఉద్యోగులను తీసుకోవడం ద్వారా మొత్తం సంఖ్య 6,06,998కి చేరినట్లు వెల్లడించింది.

15న సహారా బాధితుల 'చలో కలెక్టరేట్'

- తరలి రావాలని సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సహారా ఇండియా కస్టమర్లకు, ఏజెంట్లకు వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న చలో కలెక్టరేట్ చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, సహారా ఖాతాదారుల కమిటీ కన్వీనర్ డి.లక్ష్మీదాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి బాధితులంతా తరలి రావాలని కోరారు. విజయనగరంలోని ఎల్‌బిజి భవనంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సహర ఇండియా కంపెనీ బాధితులు జిల్లాలో సుమారు లక్ష మంది వరకు ఉన్నారని, ఏజెంట్లు కూడా అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని సహారా కంపెనీ ఆశచూపడంతో లక్షలాది మంది కొన్ని కోట్ల రూపాయలను పొదుపు చేశారని, గడువు పూర్తయినా చెల్లించకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కోర్టులో కేసులు ఉన్నాయని సాకులు చెబుతూ ఖాతాదారులకు న్యాయం చేయడంలేదని పేర్కొన్నారు. బిజెపిని గెలిపిస్తే ఖాతాదారులందరికీ డిపాజిట్లు చెల్లిస్తామని ఎన్నికలకు ముందు అమిత్‌షా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం దేశ వ్యాప్తంగా ఉన్న 4 కోట్ల మంది బాధితులకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాదిలో ఖాతాదారులు, ఏజెంట్లు పెద్ద ఎత్తున ఆందోళన చేసినా పట్టించుకోలేదన్నారు. అమిత్ షా కుమారుడికి, బిజెపికి అనుబంధంగా ఉన్న కొందరికి ఈ వ్యవహారంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఖాతాదారులందరికీ డబ్బులు జమ చేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

లావా నుంచి బ్లేజ్ ఎక్స్

న్యూఢిల్లీ : దేశీయ స్మార్ట్‌ఫోన్ కంపెనీ లావా కొత్తగా బ్లేజ్ సీరిస్‌లో కొత్త బ్లేజ్ ఎక్స్‌ను విడుదల చేసింది. 4జిబి ర్యామ్ ధరలను రూ.13,999గా, 6జిబి ధరను రూ.14,999గా, 8జిబి వేరియంట్ ధరను రూ.15,999గా నిర్ణయించింది. జులై 20 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో లభ్యం అవుతుందని ఆ కంపెనీ తెలిపింది. 64ఎంపి ప్రైమరీ కెమెరా, 2 ఎంపి అల్ట్రావైడ్ కెమెరా సహా 16ఎంపి సెల్ఫీ కెమెరాతో దీన్ని ఆవిష్కరించింది.

సంపాదకీయం

మోడీ బోధనలు !

ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం ఆస్ట్రియా రాజధాని వియన్నాను సందర్శించి, అక్కడి ప్రవాస భారతీయుల సమావేశంలో- భారత్ ప్రపంచానికి యుద్ధాన్ని కాదు; బౌద్ధాన్ని ఇచ్చిందని ఘనంగా ఉద్ఘాటించారు. "భారత్ ఎప్పుడూ సర్వ మానవాళి శాంతి సామరస్యాలనే కోరుకొంది. 21వ శతాబ్దిలో ఆ బాధ్యతను మరింత సమర్థంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉంది." అని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. మోడీ నోట బుద్ధుడి శాంతి సూత్రాన్ని, సామరస్య మంత్రాన్ని వినటం బహు బాగా ఉంది. ఆ బోధనల సారాంశాన్ని కాషాయదళం ఆచరణలో చూపగలిగితే మరింత బాగుంటుంది.

భారత సమాజపు భౌతిక పరిస్థితుల నుంచి, అంతర్మథనంలోంచి అనేక ఆచరణలు, అవలంబనలూ ఆవిర్భవించాయి. మనిషిని దుఃఖం నుంచి, రుగ్మతల నుంచి, ధనిక పేద వ్యత్యాసాల నుంచి బయటపడేయటానికి బుద్ధుడు అనేక పద్ధతులను ప్రాచుర్యంలోకి తెచ్చాడు. దానికిముందు పేదరికాన్నీ, మరణాన్ని, అంతులేని దుఃఖాన్నీ స్వయంగా చూసి చలించిపోయాడు. రాత్రికి రాత్రే సర్వ సుఖాలను త్యజించి, రాజ్యాధికార అవకాశాన్ని వదులుకొని, సన్యాసిగా మారి రాజ్య పర్యటన చేశాడు. ప్రజల కష్టాలను కన్నీళ్లను స్వయంగా చూశాడు. వాటి నుంచి వారిని విముక్తం చేయటానికి కొన్ని సూత్రాలను ప్రతిపాదించి, విస్తృతంగా ప్రచారం చేశాడు. యుద్ధోన్మాదాన్ని, హింసను, రాజ్య విస్తరణ కాంక్షనూ నిర్ద్వంద్వంగా ఖండించాడు.

బుద్ధుడి శాంతిమార్గం గురించి మాటల్లో ఘనంగా ఉటంకించిన మోడీ ఆచరణ అందుకు భిన్నంగా ఉంది. ప్రజల కష్టాలకు చలించి వంశ పారంపర్యంగా వచ్చిన రాజ్యాధికారాన్ని వదులుకొని, బుద్ధుడు ప్రజల్లో కలిసిపోతే- తన అధికారం కోసం, ఆశ్రిత పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ప్రజలను తన చట్టాలతో, విధానాలతో అణచివేత చర్యలను అవలంబిస్తున్నారు మోడీ! 14 నెలల క్రితం మణిపూర్‌లో ఇద్దరు మహిళలను ముష్కరమూక నగ్నంగా ఊరేగించి, తీవ్రంగా అవమానించినా మోడీ చలించలేదు. పెదవి విప్పి ఒక్కటంటే ఒక్క ఖండన వాక్యం పలకలేదు. ప్రపంచం మొత్తం చుట్టి వస్తున్నారు కానీ, దేశంలోనే ఉన్న మణిపూర్‌ని సందర్శించలేదు. నెలల తరబడి అమానుష కాండ కొనసాగుతున్నా - దాని నియంత్రణకు నిర్దిష్టమైన చర్యలేవీ తీసుకోలేదు. ఇటీవలి పార్లమెంటు సమావేశాల్లో ప్రతిపక్షాలు పదే పదే మణిపూర్ ఉదంతం గురించి ప్రస్తావిస్తే తప్ప మోడీ తన వ్యూహాత్మక మౌనం వీడలేదు. నోరు విప్పాక కూడా ఆ రాష్ట్రానికి భరోసానిచ్చేలా మాట్లాడలేదు. "దీనిపై రాజకీయాలు వదిలేయండి. శాంతిని పునరుద్ధరించండి." అని ప్రతిపక్షాలకు సుద్దులు చెప్పారు.

ఈ పదేళ్ల పాలనలో ప్రజల తరపున నిలబడి ప్రభుత్వ విధానాలను విమర్శించిన ప్రతి ఒక్కరిపైనా మోడీ ప్రభుత్వం తీవ్రమైన నిరంకుశ వైఖరినే ప్రదర్శించింది. నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమిస్తే- కనీవినీ ఎగరని నిర్బంధాన్ని ప్రయోగించింది. రైతులను టెర్రరిస్టులుగా అభివర్ణించింది. అన్నదాతలకు మద్దతుగా మాట్లాడినవారిపై దారుణమైన కేసులు బనాయించి, బెయిలు సైతం రాకుండా జైళ్లలో నిర్బంధించింది. పత్రికాస్వేచ్ఛను అత్యంత దారుణంగా హరించింది. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా అభివర్ణితమయ్యే భారత్‌లో పత్రికాస్వేచ్ఛ 180 ప్రపంచదేశాల్లో 159వ స్థానంలో ఉంది. ఇజ్రాయిల్ ఆక్రమిత పాలస్తీనాలో తుపాకీ మొనల మధ్య పత్రికాస్వేచ్ఛ (157వ స్థానం) ఎలా కునారిల్లుతుందో, మనదేశంలో అంతకన్నా దారుణంగా అఘోరిస్తోంది. ఈ విషయంలో పాకిస్తాన్ 152వ స్థానంతో మనకన్నా ముందుంది. బిజెపి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి భారత విదేశీ విధానానికి తూట్లు పొడిచింది. పేద, వర్ధమాన దేశాల హక్కుల గొంతుకు చేదోడుగా నిలిచిన మన పూర్వవైఖరికి భిన్నంగా యుద్ధోన్మాద అమెరికా చిత్తానికి అనుగుణంగా మసలుకోవడం మొదలు పెట్టింది. దేశంలో ఉదారవాద విధానాలతో కార్పొరేట్లకు దోచిపెడుతూ; మతోన్మాద, భావోద్వేగ రాజకీయాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తోంది. మోడీ బుద్ధుడి శాంతి సామరస్యాల గురించి మాట్లాడ్డం కాదు; వాటిని తన విధానాల్లో పాటించాలి. విద్వేష, విధ్వంస, వేధింపుల సంస్కృతికి స్వస్తి చెప్పటమే 21వ శతాబ్దపు పాలకులకు విజ్ఞత, బాధ్యత!

మహనీయుల మాట




ఏదో హాని చేయాలని
భావించినప్పుడు మాత్రమే
నీకు అధికారం అవసరం.
లేకుంటే ఏది చేయాలన్నా
ఒక్క ప్రేమ ఉంటే సరిపోతుంది.

- చార్లీ చాప్లిన్




పోరాటాలతో మోడీ ప్రభుత్వ మెడలు వంచుదాం

విశ్లేషణ



తపన్ సేన్



గత రెండు ప్రభుత్వాల్లో అమలు చేసిన విధానాలనే మోడీ మూడో ప్రభుత్వం మరింత వేగంగా తెస్తున్నదని గమనించిన వెంటనే మనం పోరాటాలకు సిద్ధంగా ఉండాలి. వీలైనంత త్వరగా స్వతంత్రంగానూ, ఐక్య కార్యాచరణతోనూ, రంగాల వారీగా, జాతీయ స్థాయిలో కార్యాచరణలకు సిద్ధమవ్వాలి. మొదటగా లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో కార్యక్రమం చేపట్టి మోడీ పభుత్వానికి తీవ్ర నిరసన తెలపాలి. ఐక్య కార్మికోద్యమాలు, కార్యాచరణలకు కృషి చేయాలి. ప్రధానంగా స్వతంత్ర కృషి పెంచుకోవడానికి గట్టిగా పని చేయాల్సిన ప్రాధాన్యతను గుర్తించాలి. జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున కార్మికులను సమీకరించాలి. రంగాల స్థాయిలో, జాతీయ స్థాయిలో ప్రతిఘటనలు నిర్మించాలి. పట్టణాల్లోనూ, గ్రామాల్లో సైతం నయా ఉదారవాద నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా నిరసించాలి. పార్లమెంటులో ప్రతిపక్షాలు ఈ డిమాండ్లను లేవనెత్తి రాజకీయంగా కూడా పోరాడేలా ఈ కార్యక్రమాలు వుండాలి.

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు దేశంలోని కార్మిక వర్గానికి, ప్రజాతంత్ర శక్తులకు కొంతలో కొంత తాత్కాలిక ఉపశమనాన్ని కలిగించాయి. బిజెపికి సొంతగా మెజార్టీ రాలేదు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలను కలుపుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మోడీ దుశ్చర్యలను పూర్తిగా ఓడించలేకపోయినా ఈ మేరకైనా నిలువరించగలిగామని ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి

హిందీ భాషా ప్రాంతాల్లో చారిత్రాత్మక రైతాంగ పోరాటాలను నిర్వహించిన రైతులు, వారికి అండగా నిలిచిన కార్మిక వర్గం సంఘటితంగా నిర్మించిన ఉద్యమాలు, వాటి తీవ్ర నిరసన ప్రభావాన్ని ఎన్నికల ఫలితాలు ప్రతిబింబించాయి. నిరంకుశ ప్రభుత్వాలను సైతం వర్గ ఐక్యత, వర్గ పోరాటాల శక్తి ఎదిరించగలవని ఈ ఫలితాలు నిరూపించాయి. నిత్యావసరాల వంటి అంశాల మీద సామాజికంగా, రాజకీయంగా కేంద్రీకరిస్తే కార్పొరేట్ మతోన్మాదుల జోడీని నిలువరించవచ్చని, పరిస్థితుల్లో మార్పు తేవచ్చనే నిజాన్ని రుజువు చేస్తున్నాయి.

నిరాశకు లోనయిన బిజెపి విద్వేషపూరిత ప్రసంగాలతో, క్రూరమైన, అసాంఘిక చేష్టలతో రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేసింది. అటువంటి శక్తుల బలం తగ్గడం దేశంలోని లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు కొంత ఊరట ఇచ్చింది. అంతమాత్రాన ఏమరుపాటుగా ఉండకూడదు. అధికారంలోకి వచ్చిన బిజెపి సమాజంలో మతం పేరిట విభజన మరింత తీవ్రతరం చేసి రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్లో తన నిరంకుశ విధానాల అమలుకు పూనుకుంటుంది. కార్పొరేట్ ప్రయోజనాలే లక్ష్యంగా ఈ ప్రభుత్వం నడుస్తున్నందున దోపిడీ చేయడానికి అవసర మైన సాధనాలన్నింటినీ ప్రయోగిస్తుంది.

తన ప్రభావం ఉన్న అన్నిచోట్లా మరింత విస్తృతంగా చొచ్చుకుపోవడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. మోడీ మూడో ప్రభుత్వ మంత్రుల ప్రమాణ స్వీకారం, క్యాబినెట్ సమావేశాల సందర్భంగా ఈ విషయం స్పష్టమైంది. గత విధానాలకు కొనసాగింపుగా సంస్కరణలను మరింత సరళతరంగా అమలు చేస్తామంది. దేశీయ, బహుళ జాతి కార్పోరేట్లు ప్రజల ఆస్తులను మరింత లూటీ చేయడానికి అవకాశమిస్తోంది. వాటి ప్రయోజనాల కోసం ప్రజలపై దాడి చేయడానికి సన్నద్ధమవుతోంది.

సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)తో పాటు కార్మిక సంఘాల ఐక్యవేదిక మోడీని ఓడించాలని ఇచ్చిన పిలుపు నెరవేరక పోయినా ప్రజానీకం ఆ పిలుపుని అందిపుచ్చుకున్నారనే సానుకూల వాస్తవాన్ని గమనించాల్సి ఉంది. మతపరంగా విడగొట్టడానికి కార్పొరేట్ గోడి మీడియా అనేక విధాలుగా విచ్చిన్న ప్రయత్నాలు చేసింది. ఎన్నికల సందర్భంగా మోడీ గ్యాంగ్ విద్వేషపూరిత ప్రసంగాలు, అసత్యాలు ప్రచారం చేసింది. అయినా సరే వారు అనుకున్న ఫలితాలను సాధించలేకపోయారు. నిరంతరంగా సాగిన కార్మిక రైతు పోరాటాలు-నిరుద్యోగం, అధిక ధరలు, పని ప్రదేశంలో దిగజారుతున్న పరిస్థితులు, కార్మిక హక్కులపై దాడులు, ప్రైవేటీకరణ, వ్యవసాయ సంక్షోభం వంటి జీవిత అవసరాలకు సంబంధించిన అంశాలను చర్చకు పెట్టాయి. ఈ పోరాటాలే ప్రతిపక్ష పార్టీలు తమ ప్రచారం సందర్భంగా పై అంశాలు మాట్లాడేట్లు చేశాయి.

వీటికి తోడుగా ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, రాజ్యాంగ హక్కులను కాపాడాలనే రాజకీయ నినాదాలు కూడా చేరాయి. ఇవన్నీ ప్రజాభిప్రాయాలతో మమేకమై ప్రతిధ్వనించాయి. పర్యవసానంగా హిందీ భాషా ప్రాంతాల్లో ప్రధానంగా ఉత్తరప్రదేశ్‌లో బిజెపి ఓటమికి దారితీశాయి.

ప్రతిపక్ష 'ఇండియా' వేదిక తన ప్రచారంలో పై ఎజెండాలపై కొంతమేరకైనా విజయవంతంగా ప్రచారం చేయడంతో ఎన్నికల్లో లబ్ధి పొందగలిగింది. రాబోయే రోజుల్లో కార్మికవర్గ పోరాటాలకు ఇదే మార్గం దిశా నిర్దేశం చేస్తుంది.

మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ నయా ఉదారవాద విధానాల దాడికి ప్రతిఘటనగా కార్మిక వర్గంలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతాంగంతో కలిసి ఐక్య కార్యాచరణ చేపట్టాలి.

ప్రభుత్వం, ఫైనాన్స్ పెట్టుబడి, కార్పొరేట్ మీడియాకు ఉన్న అవినాభావ సంబంధం ఎగ్జిట్ పోల్స్ సందర్భంగా జరిగిన షేర్ మార్కెట్ స్కామ్‌లో బహిర్గతమైంది. ఇక్కడ ఉత్పన్నమయ్యే ప్రధానమైన ప్రశ్న ఏమంటే ఈ దేశం ఎవరికి సంబంధించింది అని. ప్రజానీకంలో 10 శాతంగా ఉన్న తమ ప్రయోజనాల కోసం షేర్ మార్కెట్లో జూదమాడే వారిదా? లేక ఈ దేశం కోసం సంపద సృష్టిస్తున్న కోట్లాది కార్మికులదా?

బిజెపి నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడగానే కార్పొరేట్ వర్గానికి చెందిన నేతలు మితిమీరిన అంచనాలతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. వారు మోడీ మూడో ప్రభుత్వ సంస్కరణలను మరింత సరళంగా వేగంగా అమలు చేయడం ద్వారా కొద్దిమంది కార్పొరేట్ ప్రైవేట్ శక్తులకు ప్రయోజనం చేయాలని ఆశిస్తున్నారు. దీని వలన మెజార్టీగా ఉన్న కోట్ల మంది ప్రజల జీవన ప్రమాణాలు దిగజారడమే కాక ఆర్థిక అసమానతలు మరింతగా పెరుగుతాయి. ఇట్లాంటి విధానాల కారణంగా జరిగే కొద్ది మంది అభివృద్ధిని నిరసిస్తూ ...దేశ ప్రజానీకం పెద్ద సంఖ్యలో ఓట్లు వేసిన విషయం గమనించాలి.

అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి సాధనాలుగా ఉన్న ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, ఇతర సామ్రాజ్యవాద సంస్థలు పేర్కొంటున్న అభివృద్ధి ఇదే. గతంలో గెలిచిన రెండుసార్లు ఈ తరహాలో చేసిన పాలనపై అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, దాని మద్దతుదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ తరహా అభివృద్ధి కోసం దేశంలోని కార్పొరేట్ వర్గాల ప్రతినిధులు సిఐఐ, అసోచామ్‌లు గొంతెత్తి భూమి, శ్రమ, వ్యవసాయంలో సంస్కరణలు మరింత సరళతరం చేయాలని చెబుతున్నాయి. తద్వారా ఈ దేశంలోని కార్మికుల శ్రమశక్తిని మరింత దోచుకోవాలని చూస్తున్నాయి.

ఆర్థిక శాఖామంత్రిగా బాధ్యతలు చేపట్టిన నిర్మలా సీతారామన్ సైతం వారితో గొంతు కలుపుతూ 2014 తర్వాత చేపట్టిన సంస్కరణలను స్థూల ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి దృష్ట్యా వాటిని మరింతగా ముందుకు తీసుకు వెళ్తామని ప్రకటించారు. జీవించడానికి మార్గం సుగమం చేస్తామంటూనే ప్రధాన దృష్టి వ్యాపారాన్ని సులభం చేయడం కోసం జాతీయ ఖజానా నుండి కార్పొరేట్లకు మరిన్ని రాయితీలు, ప్రోత్సాహకాలు ఉంటాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. గత విధానాలనే కొనసాగిస్తామంటున్న ఆమె ప్రజోపయోగానికి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అనేక రంగాలను లీజుకిచ్చే పేరిట కార్పొరేట్లకు అప్పజెప్పడానికి సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

గత విధానాలు కొనసాగింపు పేరిట 100 రోజుల పథకాన్ని ఎన్డీఏ ప్రభుత్వం అన్ని మంత్రిత్వ శాఖల్లోను తీసుకురానుంది. దీని ఉద్దేశం దేశంలో కార్మికవర్గం పైన దాడి చేయడం తప్ప మరోటి కాదు. సంస్కరణలను సరళతరం చేయడంలో వచ్చే తొలి మార్పులపై కథనాలు మీడియాలో ఇప్పటికే వచ్చాయి.

ప్రైవేట్ గుత్తాధిపత్యాన్ని తీవ్రంగా పెంచే దిశగా ఆర్థిక విధానాలు రూపుదిద్దుకుంటున్నాయి. ఉద్యోగ సంబంధాలు కూడా యాజమాన్యాలకు మేలు చేసే విధంగా మారతాయని అనధికారికంగా వార్తలు వస్తున్నాయి. ఐదు లక్షల మందికి పైగా కొత్త అప్రెంటిస్‌లను తేవడం ద్వారా నైపుణ్య శాఖ అప్రెంటిస్ విధానాన్ని ప్రోత్సహించేట్లు తర్ఫీదు ఇస్తోంది. అప్రెంటిస్ విధానం తేవడం ద్వారా కార్మిక చట్టాల పరిధిలో నుంచి ఉత్పత్తి కార్మికులను తొలగించి వారిని కట్టు బానిసలుగా చేసి వారి హక్కులను కాల రాస్తుంది. దీనివలన దుర్బలత్వం, అనిశ్చితత్వం మరింతగా పెరుగుతాయి.

లేబర్ కోడ్‌లను నోటిఫై చేయడం తమ తక్షణ ప్రాధాన్యతగా ఉందని ఇప్పటికే కార్మిక శాఖ ప్రకటించింది. దొడ్డి దారిన వీటిని అమలు చేసే ప్రయత్నాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. బడా కార్పొరేట్లకు దేశ ఖజానా నుండి ప్రోత్సాహకాలు ఇచ్చే విధానం, జాతీయ నగదీకరణ విధానం ద్వారా ప్రైవేటీకరించే యత్నాలు ప్రారంభమయ్యాయి. మౌలిక రంగాల్లో టెలికం, గనులు, రైల్వే, జాతీయ రహదారులు, పోర్టులు వంటి రంగాలు ఇప్పటికే దీనికి లోనయ్యాయి. ప్రభుత్వ పెట్టుబడులతో బలోపేతమైన ఈ రంగాలను కార్పొరేట్లకు బదలాయిస్తున్నారు.

గత రెండు ప్రభుత్వాల్లో అమలు చేసిన విధానాలనే మోడీ మూడో ప్రభుత్వం మరింత వేగంగా తెస్తున్నదని గమనించిన వెంటనే మనం పోరాటాలకు సిద్ధంగా ఉండాలి. వీలైనంత త్వరగా స్వతంత్రంగానూ, ఐక్య కార్యాచరణతోనూ, రంగాల వారీగా, జాతీయ స్థాయిలో కార్యాచరణలకు సిద్ధమవ్వాలి. మొదటగా లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో కార్యక్రమం చేపట్టి మోడీ ప్రభుత్వానికి తీవ్ర నిరసన తెలపాలి.


ఐక్య కార్మికోద్యమాలు, కార్యాచరణలకు కృషి చేయాలి. ప్రధానంగా స్వతంత్ర కృషి పెంచుకోవడానికి గట్టిగా పని చేయాల్సిన ప్రాధాన్యతను గుర్తించాలి. జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున కార్మికులను సమీకరించాలి. రంగాల స్థాయిలో, జాతీయ స్థాయిలో ప్రతిఘటనలు నిర్మించాలి. పట్టణాల్లోనూ, గ్రామాల్లో సైతం నయా ఉదారవాద నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా నిరసించాలి. పార్లమెంటులో ప్రతిపక్షాలు ఈ డిమాండ్లను లేవనెత్తి రాజకీయంగా కూడా పోరాడేలా ఈ కార్యక్రమాలు వుండాలి.

మన కార్యాచరణ సంక్షేమానికో, సహాయానికో మాత్రమే ఉద్దేశించింది కాదు. వర్గ పోరాట దృష్టితో వర్గ ఉద్యమాల్ని వర్గ సంఘాన్ని నిర్మించాలనే సిద్ధాంత ఆధారంగా నడిచే కార్యాచరణ మనది. కార్మికుల సామాజిక, రాజకీయ అంశాల్లో వర్గ దృష్టితో మన జోక్యం ఉండాలి. ఇది జరగాలంటే వర్గ పోరాటంపై స్పష్టమైన అవగాహన ఉండాలి. కార్మికుల చైతన్యం ఆర్థిక స్థాయి నుండి సామాజిక స్థాయికి అక్కడ నుండి రాజకీయ చైతన్యానికి పెంచడంపై చైతన్య పూర్వక కృషి ఉండాలి. ఫాసిస్ట్ శక్తులను, కార్పొరేట్ వర్గాన్ని ఎదుర్కోవాలంటే...సైద్ధాంతికంగా, రాజకీయంగా సంఘటితమైన కార్మికవర్గం నుండి వచ్చిన శక్తి మాత్రమే ఏ దాడులనైనా తట్టుకొని...నికరంగా నిలబడి పురోగమిస్తుందని విశ్వాసాన్ని కలిగి ఉండాలి.

/ వ్యాసకర్త సిఐటియు ప్రధాన కార్యదర్శి /

'మరో జన్మ మరో యాత్ర' అబద్ధం

కామన్ సెన్స్



విజ్ఞాన శాస్త్ర ప్రకారం పదార్థం, పదార్థ లక్షణాలూ మనకు తెలుసు. పదార్థాన్ని విభజిస్తూ పోతే, తుదకు విభజించడానికి వీలుకాని సూక్ష్మ కణాలు మిగులుతాయి. వాటినే అణువులు అంటున్నాం. అణువులను వాటి మార్పులను బట్టి రసాయనిక జీవ ప్రక్రియలను అర్థం చేసుకుంటున్నాం. వ్యాఖ్యానిస్తున్నాం. పదార్థ స్వభావాన్ని పరిశీలించడం, వాటిని క్రమ పద్ధతిలో పొందుపరచడం, వివిధ పరిశీలనల ఫలితాలను సమీక్షించుకోవడం సమన్వయించుకోవడం ఒక పద్ధతి. ఈ పరిశీలనల ఆధారంగా కొన్ని ఉపయోగకరమైన-వివేకవంతమైన సిద్ధాంతాలు ఏర్పడ్డాయి. సిద్ధాంతం నిర్దేశించిన సూత్రాలను ప్రయోగం నిర్ధారిస్తుంది. పునర్జన్మ, మానవాతీత శక్తుల గురించి మత విశ్వాసకులు చెప్పేది సిద్ధాంతాలే తప్ప, వారు చేసిన ప్రయోగాలు ఏమున్నాయనీ? చూపించిన దాఖలాలు ఏమున్నాయనీ?



డా|| దేవరాజు మహారాజు

ప్రజల్లో నాటుకుపోయిన బలమైన అభిప్రాయాల్ని మార్చడం అంత తేలిక కాదు. అట్లని ప్రజల అభిప్రాయాలన్నీ సరైనవేనని శాస్త్రీయ వివరణలు ఇవ్వడం చాలా ప్రమాదాలకు దారితీస్తుంది. 'పునర్జన్మ' అనేది మత సంబంధమైన ఒక విశ్వాసం అని ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ బ్రిటానికా చెప్తోంది. ఈ నమ్మకాలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నాయి కానీ, ఆసియాలో మరీ ఎక్కువ. ముఖ్యంగా హిందూ, సిక్కు మతాలు జైన, బౌద్ధాలలో కొన్ని శాఖలు పునర్జన్మను, మానవాతీత శక్తుల్ని నమ్ముతున్నాయి. ఇటు భారతీయ సంస్కృతి అటు గ్రీకు సంస్కృతులలో ఈ నమ్మకాలు జీర్ణమైపోయాయి. కొన్ని క్రైస్తవ శాఖలలోనూ ఈ నమ్మకాలు ఎక్కువ.

ఉపనిషత్తుల్లో ఈ విశ్వాసాల ప్రస్తావన ఉంది. అంతెందుకు మాంత్రికులు పరకాయ ప్రవేశం చేసి, తమాషాలు చేసిన సంఘటనలు మన తాతమ్మ, అమ్మమ్మలు చెప్పే కథల్లో కోకొల్లలుగా ఉంటాయి. అందుకే, ఇంత వరకున్న మన సాహిత్యంలో ప్రధానంగా అశాస్త్రీయ ధోరణులే ఉన్నాయి. అందులోంచి బయటపడి, ఆధునిక వైజ్ఞానిక దృష్టి కోణం లోంచి నూతన సాహిత్య సృష్టి చేయాల్సి ఉంది.

ఇక్కడ మనం గ్రహించాల్సిందేమంటే-కర్మ సిద్ధాంతం నమ్మిన చోటే పునర్జన్మ ఉంటోంది. కర్మ సిద్ధాంతాన్ని తిరస్కరిస్తే పునర్జన్మా ఉండదు, మానవాతీత శక్తులూ ఉండవు.

పుట్టిన పాపాయి మెదడులో గత జన్మకు సంబంధించిన ఛాయలు ఉంటాయని భారతీయ తత్వవేత్తలలో సాంఖ్యావాదులు చెపుతున్నారు. ఈ వాదాన్ని ఆధారం చేసుకునే అక్కడక్కడ అప్పుడప్పుడు కొందరు కథలల్లుతున్నారు. బాలికకో, బాలుడికో పునర్జన్మ జ్ఞాపకాలున్నాయని నిరూపించడానికి ప్రయత్నిస్తూ వార్తలు సృష్టిస్తున్నారు. ఈ విషయం ఇతివృత్తంగా సాహిత్యం, చిత్రలేఖనాలు, చలనచిత్రాలు వగైరాలన్నీ రూపు దిద్దుకుంటూ వస్తున్నాయి. ఈ అభిప్రాయం ఎంతగా నాటుకు పోయిందంటే-ఎవరైనా ఇదంతా ట్రాష్ అని అంటే చాలామందికి నచ్చదు. పైగా, మనోభావాలను దెబ్బ దీసుకుంటారు కూడా! దేవుడు, మానవాతీత శక్తులు, ఆత్మ, పునర్జన్మ మొదలైనవన్నీ ఒకదాని మీద ఒకటి పెరిగినవి. పేక మేడల్లాగా-ఇందులో ఏ ఒక్కదాన్ని పడగొట్టినా మిగతావన్నీ సులభంగా కూలిపోతాయి!

కొంతమందిలో కొన్ని విషయాలలో అసాధారణ ప్రతిభ కనిపిస్తుంది. కదా? అంటే అది నిజమే! అలాంటి వాటిని జీవశాస్త్రం ఒప్పుకుంటుంది. సహజ సిద్ధంగా కొందరికి కొన్ని విషయాలలో అసాధారణ ప్రతిభాపాటవాలు ఉండొచ్చు అవన్నీ మహిమలు కావు. అతీంద్రియ శక్తులు కూడా కావు. వారసత్వ లక్షణాల నుండి వచ్చిన ప్రతిభ అది. దాన్ని కొందరు స్వయంకృషితో మరింతగా మెరుగు పరుచుకుంటారు. అంతే తప్ప పూర్వజన్మ లక్షణాలు కావు. ఇక పోతే, మరణం తర్వాత జీవితాన్నీ, మానవాతీత-శక్తులు ఉండడాన్నీ విజ్ఞాన శాస్త్రం ఒప్పుకోదు. గణిత శాస్త్ర సమస్యల్ని కంప్యూటర్ కంటే వేగంగా పరిష్కరిస్తున్న వాళ్ళను నిజజీవితంలో చూస్తునే ఉన్నాం. మూడేళ్ళ వయసులోనే చక్కని నాట్య ప్రదర్శన ఇస్తున్న పసికూనలు మన మధ్యలోనే ఉన్నారు. శతావధానాలు, గారడీ విద్యలు, ఇంద్రజాలాలు మన నిత్య జీవితంలో భాగమైపొయ్యాయి. సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తే విశేషాలు వీటిలో ఉన్నాయి. అంత మాత్రం చేత ఇవి మానవాతీత శక్తులుగా చలామణి కావడం లేదు. మానవాతీత శక్తులు ఉన్నాయా? అని ప్రశ్నించుకోవడం కంటే, అసలు అలాంటివి ఉండడానికి వీలుందా? – అని ఆలోచించడం ముఖ్యం.

విజ్ఞాన శాస్త్ర ప్రకారం పదార్థం, పదార్థ లక్షణాలూ మనకు తెలుసు. పదార్థాన్ని విభజిస్తూ పోతే, తుదకు విభజించడానికి వీలుకాని సూక్ష్మకణాలు మిగులుతాయి. వాటినే అణువులు అంటున్నాం. అణువులను వాటి మార్పులను బట్టి రసాయనిక జీవ ప్రక్రియలను అర్థం చేసుకుంటున్నాం. వ్యాఖ్యానిస్తున్నాం. పదార్థ స్వభావాన్ని పరిశీలించడం, వాటిని క్రమ పద్ధతిలో పొందుపరచడం, వివిధ పరిశీలనల ఫలితాను సమీక్షించు కోవడం సమన్వయించుకోవడం ఒక పద్ధతి. ఈ పరిశీలనల ఆధారంగా కొన్ని ఉపయోగకరమైన-వివేక వంతమైన సిద్ధాంతాలు ఏర్పడ్డాయి. సిద్ధాంతం నిర్దేశించిన సూత్రాలను ప్రయోగం నిర్ధారిస్తుంది. పునర్జన్మ, మానవాతీత శక్తుల గురించి మత విశ్వాసకులు చెప్పేది సిద్ధాంతాలే తప్ప, వారు చేసిన ప్రయోగాలు ఏమున్నాయనీ? చూపించిన దాఖలాలు ఏమున్నాయనీ? మరణించిన ప్రాణి మళ్ళీ బతకగలదని -టెలిపతి, సైకోకైనసిస్, ప్రికాగ్నిషన్, క్లైరోయన్స్ వంటివి ఉంటాయని సహేతుకంగా చెప్పడానికి వీలులేదు. ఈ విశ్వాంతరాళంలో ఇంకా మనకు తెలియని పదార్థాలు, అణువులు ఉన్నాయని బయటపడితే, వాటి లక్షణాలు అర్థమైతే, అప్పుడు మళ్ళీ ఈ విషయాలన్నీ విశ్లేషించుకోవచ్చు.

ఆత్మ, పునర్జన్మకు సంబంధించి కొందరు వితండవాదాలు చేస్తుంటే, మరి కొందరు నిజాయితీగా ఉత్సుకతతో పరిశీలనలు ప్రయోగాలు చేస్తున్నారు. అమెరికాలో ఇయమ్. హాన్సెల్ అనే అతను ఈ విషయాల్లో విశేషంగా కృషి చేశాడు. నిజ నిర్ధారణకు పూనుకున్నాడు. ఆయన ఇంటర్వ్యూ చేసిన వారిలో తొంభయి తొమ్మిది మంది తాము చేసినవి తప్పిదాలని, మహిమలు కావని ఒప్పుకున్నారు. ఉదాహరణకు మార్గరెట్ షాక్స్ సోదరీమణుల విషయం చెప్పుకోవచ్చు-మార్గరెట్, లియాఫిష్ ఇద్దరూ అక్కా చెల్లెళ్ళు. వాళ్ళు బాల్యంలో తమ తల్లిని భయపెట్టడానికి సరదాగా ఏవేవో కొంటె చేష్టలు చేస్తుండేవారు. లైట్లు, ఆర్పేసి పడుకున్న తర్వాత, కాలి బొటన వేళ్ళను టిక్‌టిక్‌మని విరవడం, రెండు బొటన వేళ్ళ గోళ్ళు వేగంగా రాసి, ఆ రాపిడితో వింత వింత ధ్వనులు సృష్టించడం అభ్యాసం చేశారు. అది ఇల్లు దాటి, ఊరు దాటి, పట్టణాలకు తెలిసే సరికి జనం తండోప తండాలుగా రావడం మొదలు పెట్టారు. అలాంటి పరిస్థితుల్లో వారు మరింత జాగ్రత్తగా ఉండాల్సి వచ్చింది. తాము సృష్టించుకున్న ఆధ్యాత్మిక చీకటి గది లోంచి జవాబులివ్వడం మొదలు పెట్టారు. డబ్బు విపరీతంగా రావడం మొదలైంది. వారు పెరిగి, వివాహాలు చేసుకుని, కుటుంబ బాధ్యతలు మోయాల్సిన దశలో ఇక వీలుకాక ప్రదర్శనలు ఆపేశారు. ఇలాంటి పనులు ఆందరూ డబ్బుకోసమే చేయకపోవచ్చు. పేరు కోసం, ప్రత్యేక గుర్తింపు కోసం కూడా చెయ్యొచ్చు లేదూ కష్టపడకుండా గొప్పవాళ్ళను తమ చుట్టూ తిప్పుకోవచ్చని కూడా చెయ్యొచ్చు.

ఇక్కడ మనం మరోక విషయం ఆలోచించాలి! ఆకలి, దాహం, బాధ సంతోషం లాగా-నిజంగా పునర్జన్మ గానీ, మానవాతీత శక్తులు గానీ ఉంటే, అవి మనుషులందరికీ అనుభవంలోకి రావాలి. కానీ, యోగులకు సన్యాసులకు, బాబాలకు మాత్రమే కొన్ని వింత అనుభవాలు ఎందుకొస్తున్నాయి? వస్తున్నాయని వారు ప్రకటించుకుని వాటితో వ్యాపారాలు చేసుకుంటున్నారన్నది మనం గ్రహించాలి. పోనీ అలా వస్తే వాటిని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించిన వారు ఎవరూ లేరు కదా? నిజ నిర్ధారణకు నిలబడి రుజువు పరిచిన వారు లేరు కదా? ఉట్టి మాటలను మేజిక్కులని, అతీంద్రియ శక్తులని ఎలా నమ్ముదాం? ప్రతి జీవికి ఆత్మ ఉందనే అనుకుందాం. ఊరికే చర్చ కోసం అనుకుందాం-అయితే ఒక ఆత్మ విడిపోయి రెండు మూడు ప్రాణాలుగా జన్మ నెత్తుతుందన్న విషయం ఎవరూ చెప్పలేదు. ఒకప్పుడు మనం ముక్కోటి ఆంధ్రులం జనాభా పెరిగి రెండింతలకు పైగా అయ్యాం, అంటే ఈ పెరుగుతున్న ఆత్మలు ఎక్కడివీ? జీవశాస్త్రం జవాబు చెప్పగలదు, కానీ, వాటి గురించి ఎక్కువగా మాట్లాడే వారి దగ్గర సమాధానం లేదు. శాస్త్రీయ దృక్పథం కలిగి, పరిణామ సిద్ధాంతాన్ని గట్టిగా నమ్మే భౌతిక వాదులకు జవాబు దొరుకుతుంది. పునర్జన్మ నిజం కాదనీ, కేవలం మత సంబంధమైన ఒక ప్రగాఢ విశ్వాసమేనని!

/ వ్యాసకర్త సాహితీవేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్ మెల్బోర్న్ నుంచి /

జనవాక్యం

కారుణ్య నియామకాలేవీ!

ఆదర్శ పాఠశాలల్లోని రెగ్యులర్ సర్వీస్ నిర్వహిస్తూ మరణించిన టీచింగ్ సిబ్బందికి కారుణ్య నియామకాల అమలు కోసం ఒక విధానాన్ని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ అడాప్ట్ చేసుకోవాలి. అర్హత గల కుటుంబాల్లో ఒకరికి కారుణ్య నియామకం ఇచ్చి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ఆ కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు. సర్వీస్ రూల్స్ కోసం ఒక కమిటీని వేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి. ఆంధ్ర ప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజన తర్వాత 164 మండలాల్లో ప్రస్తుతం ఆదర్శ పాఠశాలలు రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో, పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఉద్యోగంలో ఉండగా మరణించిన రెగ్యులర్ ఉపాధ్యాయుల సంఖ్య 20 లోపు ఉంది. ఈ కుటుంబాల కోసం ఒక ఉద్యోగాన్ని మానవతా దృక్పథంతో సృష్టించి విద్యా శాఖలో లేదా జిల్లా యూనిట్ పరిధిగా చూపి కారుణ్య నియామకాలు కల్పించాలని ప్రభుత్వానికి అనేకమార్లు చేసిన విజ్ఞప్తిని పరిశీలించాలి. ఆ కుటుంబాల్లో వెలుగు నింపాలి. ఆ కుటుంబాలకు ప్రభుత్వం తోడుగా ఉండాలి.

- బి. సురేష్, విజయవాడ.

సహారా, అగ్రి బాధితులను ఆదుకోరా?

మన రాష్ట్రంలోనూ తెలంగాణలోనూ అనేక వేల మంది సహారా, అగ్రి గోల్డ్ సంస్థల్లో వెయ్యి రూపాయలు నుండి లక్షల్లో నగదు పొదుపు చేసుకొని సొమ్ము మెచ్యూరిటీ సమయం దాటిపోయినా అందక చాలా అవస్థలు పడుతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా...ఏవేవో అభ్యంతరాలు, నిబంధనలు పెడుతున్నారు. పది వేల రూపాయలు లోపు దాచుకున్న వారికి అమౌంట్ ఇస్తున్నారని అంటున్నారు. ప్రధానమంత్రి, తెలుగు రాష్ట్రాల ఇద్దరు ముఖ్యమంత్రులు, ప్రజాస్వామ్యవాదులు చొరవ తీసుకొని సహారా, అగ్రి గోల్డ్ సమస్యను పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి.

- శీరాపు శ్రీనివాసరావు, దాసన్నపేట, విజయనగరం.

ప్రతి గ్రామానికి రహదారి అనుసంధానం

- మ్యాచింగ్ గ్రాంటు తగ్గించేలా కేంద్రంతో మాట్లాడుతాం
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనాభా 250కు మించి ఉన్న ప్రతి గ్రామానికి రహదారి అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. గ్రామాలకు రహదారుల అనుసంధానంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తేనే ప్రగతి సాధ్యమన్నారు. గ్రామీణ రహదారుల ప్రాజెక్టుల్లో రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాల్సిన 30 శాతం మ్యాచింగ్ గ్రాంటును 10 శాతానికి తగ్గించేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరతామని, ఆ విధంగా అవసరమైన మార్పులు చేయాలని చెప్పారు. పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఎఐఐబి) అధికారులతో విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. రూ.4,976 కోట్ల నిధులతో 7,213 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి సిద్ధం చేసిన ప్రతిపాదనలపై చర్చించి ఇంజినీర్లకు పవన్ దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో రహదారుల నిర్మాణం వల్ల పేదరిక నిర్మూలనతోపాటు సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు మెరుగవుతాయనే విషయాన్ని అందరూ గుర్తించాలని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణ ప్రక్రియ కుంటుపడిందని తెలిపారు. ఈ సమావేశంలో ఎఐఐబి అధికారులు ప్రదీప్ అహ్మద్, అశోక్‌కుమార్, శివరామకృష్ణ శాస్త్రి, పంచాయతీరాజ్‌శాఖ చీఫ్ ఇంజినీర్ బాలూ నాయక్, ఎపిఆర్‌ఆర్‌పి అధికారులు సివి సుబ్బారెడ్డి, వివి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతి కోసం పార్లమెంటులో చర్చించాలి: ఎంపీలతో సమీక్ష

రాష్ట్ర ప్రగతి, మానవ వనరుల అభివృద్ధి, పర్యాటకం వంటి ముఖ్యాంశాలను పార్లమెంటులో చర్చకు వచ్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలని డిప్యూటీ సిఎం, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. జనసేన ఎంపీలు వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌తో పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. సత్వర ఉద్యోగ అవకాశాలు పెరిగే టూరిజం, సర్వీస్ రంగాలపై దృష్టి సారించాలని ఎంపీలకు సూచించారు. ఇవి రాష్ట్రంలో అమలయ్యేలా కేంద్ర మంత్రులతో మాట్లాడాలని తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో పరిశోధనలపై దృష్టి సారిస్తే అద్భుతమైన యువ శాస్త్రవేత్తలు బయటకు వస్తారని, కొత్త ఆవిష్కరణలకు రాష్ట్రం వేదికగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. అవకాశాలు, మార్గాలు లేక యువత పరిశోధన రంగం వైపు రాలేకపోతున్నారని తెలిపారు.

ప్రభుత్వం మారినా ఆగని గృహనిర్బంధాలు

- సిఎం పర్యటన నేపథ్యంలో సిపిఎం నాయకుల హౌస్ అరెస్టు

ప్రజాశక్తి- యంత్రాంగం (అనకాపల్లి జిల్లా)

ప్రభుత్వం మారినా గృహనిర్బంధాలు ఆగలేదు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా సిపిఎం నాయకులను నిర్బంధించడం పరిపాటిగా మారింది. అనకాపల్లి జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ఇందుకు అద్దం పడుతోంది. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్దగల పోలవరం ఎడమ కాలువ పరిశీలనకు సిఎం చంద్రబాబు శుక్రవారం వచ్చారు. ఈ నేపథ్యంలో ఎస్.రాయవరం మండలం పి.ధర్మవరం అగ్రహారం గ్రామంలో సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును, అచ్యుతాపురంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.రామును, కోటవురట్లలో సిఐటియు నేత జి.వరలక్ష్మిని, అల్లూరి జిల్లా పాడేరులో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్సను, జిల్లా నాయకులు వంతల దాసును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ పర్యటన సందర్భాల్లోనూ సిపిఎం నాయకులను గృహనిర్బంధంలో ఉంచేవారు.



అల్లూరి జిల్లా పాడేరులో సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్సను గృహ నిర్బంధంలో ఉంచిన పోలీసులు

సిపిఎం ఖండన

సిపిఎం నాయకులను గృహ నిర్బంధం చేయడాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం తీవ్రంగా ఖండించారు. ప్రజలకు చేస్తున్న అన్యాయాలపైనా, జిల్లాలోని అనేక సమస్యలపైనా నిలదీస్తారని భయమా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా పోలీసులు వ్యవహరించిన తీరును ఖండించారు. అణచివేత, నిర్బంధ చర్యలను మాని, ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వాటిని పరిష్కరించాలని కోరారు.

సిఏ పరీక్షా ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ : సిఎ ఫైనల్, ఇంటర్ రిజల్ట్స్‌ను ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) గురువారం విడుదల చేసింది. అభ్యర్థులు తమ ఫలితాల కోసం రోల్ నెంబర్, రిజిస్ట్రేషన్ నెంబర్లతో icai.nic.in. అధికారిక వెబ్‌సైట్‌లో లాగిన్ కావాల్సి ఉంటుందని పేర్కొంది. ఫలితాలతో పాటు మెరిట్ లిస్ట్, పాస్ పర్సెంటేజ్ వంటి ఇతర వివరాలను కూడా వెల్లడించింది. ఐసిఎఐ సిఎ ఇంటర్ గ్రూప్ 1 పరీక్షలు మే 3, 5, 9 తేదీల్లో నిర్వహించగా, గ్రూప్ 2 పరీక్షలను మే 11, 15, 17 తేదీల్లో నిర్వహించింది. సిఎ ఫైనల్ గ్రూప్ 1 పరీక్షలు మే 2, 4, 8 తేదీల్లో నిర్వహించగా, గ్రూప్ 2 పరీక్షలను మే 10, 14, 16 తేదీల్లో జరిగాయి. ఇంటర్నేషనల్ టాక్సేషన్ అసెస్‌మెంట్ పరీక్ష మే 14, 16 తేదీల్లో జరిగింది.



ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు పిహెచ్‌సి వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

ఆశా వర్కర్ కుటుంబానికి న్యాయం చేయాలి

- తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా
- అధికారుల హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి – ఎ.కొండూరు :

విధి నిర్వహణలో మరణించిన ఆశా వర్కర్ తోట రాధ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ గురువారం ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరులో ఆశాలు ధర్నా నిర్వహించారు. ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిర్వహించిన ఈ ధర్నాలో పెద్దఎత్తున ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. రాధ మృతికి అధికారుల వైఖరే కారణమని యూనియన్ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి ఎ.కమల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మృతికి అధికారులే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ రియాజ్ హుస్సేన్ అక్కడికి వచ్చారు. ఆశాల డిమాండ్లను తిరువూరు ఆర్‌డిఒ ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పినా ఆందోళనకారులు శాంతించలేదు. దీంతో ఆయన... యూనియన్ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరిపారు. మృతురాలి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, మరణానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో తహశీల్దారు.. డిఎంఅండ్‌హెచ్‌ఒకు ఫోన్‌చేసి యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.కమల, సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరావుతో మాట్లాడించారు. డిమాండ్లను పరిశీలిస్తామని డిఎంఅండ్‌హెచ్‌ఓ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ధర్నా విరమించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దారుకు అందజేశారు.

వైద్యాధికారులదే బాధ్యత : కమల

ఈనెల ఆరున జ్వరంతో బాధపడుతూనే రాధ విధులకు హాజరయ్యారని, ఎఎన్‌ఎం, నోడల్ అధికారులు ఆమెకు సెలవు మంజూరు చేయలేదని ఆశా వర్కర్స్ యూనియన్ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి ఎ.కమల తెలిపారు. దీంతో సోమవారం నాటికి జ్వరం తీవ్రత పెరిగి ఎ.కొండూరు పీహెచ్‌సి నుండి తిరువూరు ఏరియా ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారని చెప్పారు. అక్కడ ఆమె పరిస్థితి విషమించటంతో విజయవాడ వెళ్లాలని సలహా ఇచ్చారని తెలిపారు. చిన అవుటపల్లిలోని పిన్నమనేని ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యంలోనే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ స్థితిగతులపై ప్రధానికి నివేదిస్తా

- మూతబడుతుందన్న ఆందోళన వద్దు
- కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ స్థితిగతులను ప్రధానికి నివేదిస్తానని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి చెప్పారు. ఆ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి బుధవారం ఆయన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల ప్రతినిధులనుద్దేశించి కుమారస్వామి మాట్లాడుతూ 'విశాఖ స్టీల్‌ప్లాంటును పరిశీలించాను. దీనిపై ప్రధాని నరేంద్ర మోడీకి సమగ్ర నివేదిక అందచేస్తాను. దేశ ఆర్థిక అభివృద్ధికి ఈ ప్లాంట్ సహాయపడుతోందని వివరిస్తా.' అని తెలిపారు. ప్లాంట్ మూతబడుతుందని ఎవరూ భయపడవద్దన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై అధ్యయనం చేసేందుకు వచ్చానని, ఈ ప్లాంట్ దేశ ఆర్థిక అభివృద్ధికి సహాయపడుతున్నట్లు తనకు అర్థమైందని తెలిపారు. ఈ విషయాన్ని కేంద్రంతో చర్చిస్తానన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో ప్లాంట్ వంద శాతం ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. భారతదేశ జిడిపిని మెరుగుపరచడంలో ఆర్‌ఐఎన్‌ఎల్ ఇతోధికంగా సహాయపడుతోందని తాను భావించినట్లు తెలిపారు. వేలాదిమంది నిర్వాసితులు స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి ఉన్నారని తనకు అర్థమైందన్నారు. ఒకటి, రెండు నెలల్లో శుభవార్త వింటారని చెప్పారు. శ్రీనివాస వర్మ మాట్లాడుతూ కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించడానికి కుమారస్వామి రావడం ప్లాంట్ పట్ల ఆయనకున్న శ్రద్ధ తెలుస్తోందన్నారు. కేంద్ర మంత్రులకు ఉక్కు కర్మాగారం సిఎండి అతుల్ భట్ సంస్థ పని తీరును వివరించారు. తర్వాత కేంద్ర మంత్రులు అవార్డు గ్యాలరీని సందర్శించారు. అక్కడున్న జాతీయ, అంతర్జాతీయ అవార్డులను పరిశీలించి అభినందించారు. అనంతరం కోక్ ఒవెన్స్, బ్లాస్ట్ ఫర్నేస్-3, స్టీల్ మెల్టింగ్ షాప్-2, వైర్ రాడ్ మిల్-2 విభాగాలను సందర్శించారు. సిఎండి, డైరెక్టర్లు, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, సీనియర్ అధికారులతో సమీక్షించారు. విశాఖ ఉక్కు కర్మాగారం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిఎండి అతుల్ భట్ వివరించారు. స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రులతో మాట్లాడారు.

స్టీల్‌ప్లాంట్ ప్రధాన సమావేశ మందిరంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో, ఇతర ప్రముఖులతో కేంద్ర మంత్రులు సమావేశమయ్యారు. ఈ కార్యక్రమాల్లో ఉక్కు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ రాయ్, విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, సెయిల్ స్వతంత్ర డైరెక్టర్ సాగి కాశీ విశ్వనాథ రాజు, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాజీ ఎంపి జివిఎల్ నరసింహారావు, ప్లాంట్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామికి కార్మిక సంఘాల నేతల విన్నపాలు

కార్మిక సంఘాల నేతలు సమస్యలను కేంద్ర మంత్రి కుమారస్వామికి విన్నవించారు. కార్మికులకు వేతనాలు సరిగా అందడం లేదని, ముడిసరుకు అందకపోవడంతోనే స్టీల్‌ప్లాంట్ నష్టాల్లోకి వెళుతోందని వివరించారు. వీరిలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి రామస్వామి, ఎఐటియుసి నాయకులు డి.ఆదినారాయణ, ఐఎన్‌టియుసి నాయకులు మంత్రి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

మద్దతు ధరకు చట్టబద్ధత



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కెఎం నేతలు

- మళ్లీ పోరుబాటలో సంయుక్త కిసాన్ మోర్చా
- ఆగస్టు 9న 'కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే'

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

అన్ని పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) సి2 ప్లస్ 50 శాతం ప్రాతిపదికన ఇచ్చేందుకు చట్టబద్ధత కల్పించాలని, పంటలను గ్యారెంటీగా సేకరించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) డిమాండ్ చేసింది. రుణ మాఫీ, పంటల బీమా, రైతులు, వ్యవసాయ కార్మికులకు పెన్షన్, విద్యుత్ ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవడం తదితర పెండింగ్‌లో ఉన్న డిమాండ్లపై మళ్లీ పోరుబాటపట్టాలని నిర్ణయించింది. రైతుల డిమాండ్లపై ఆగస్టు 9న దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శలు చేయాలని, క్విట్ ఇండియా డేను 'కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే'గా నిర్వహించాలని ఎస్‌కెఎం పిలుపునిచ్చింది. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌కెఎం నేతలు హన్నన్ మొల్లా, సునీలం, అవిక్ సాహా, రావుల వెంకయ్య, ప్రేమ్ సింగ్ గెహ్లాత్, పి కృష్ణప్రసాద్ మాట్లాడారు. ఇక్కడ బుధవారం నిర్వహించిన ఎస్‌కెఎం సర్వసభ్య సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. ఈ నెల 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు రైతుల డిమాండ్లపై ఎస్‌కెఎం రాష్ట్ర నాయకత్వం లోక్‌సభ, రాజ్యసభ ఎంపిలందరికీ వినతిపత్రాలు ఇవ్వనున్నారు. డిమాండ్లపై ఎన్‌డిఎ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అభ్యర్థిస్తారు. ప్రధాని మోడీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్‌లను కూడా కోరుతున్నట్లు తెలిపారు. వారికి కూడా తమ డిమాండ్లతో కూడిన మెమొరాండం సమర్పిస్తారు. వ్యవసాయ ఉత్పత్తి, వాణిజ్యంలో డబ్ల్యుటిఒ నుండి ఇండియా బయటకు రావాలని నాయకులు డిమాండ్ చేశారు. తీవ్రమైన నీటి సంక్షోభం పరిష్కరించాలని, అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు రుణమాఫీ చేయాలని, రోడ్డు కారిడార్లతో ఇండియా-పాకిస్థాన్ వాణిజ్యాన్ని తెరవాలని తదితర డిమాండ్లకు సంబంధించి ఆగస్టు 17న పంజాబ్‌లో ముఖ్యమంత్రితో సహా మంత్రులందరి ఇళ్ల వద్ద మూడు గంటల పాటు ఆందోళన చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని కోరుతూ హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్ముకాశ్మీర్ రాష్ట్ర సమన్వయ కమిటీలు సమావేశాలను ఏర్పాటు చేస్తాయన్నారు. ఎన్నికల్లో బిజెపిని శిక్షించాలని కోరుతూ ఎస్‌కెఎం డిమాండ్ల ఆధారంగా రైతుల్లో స్వతంత్రంగా, భారీ ప్రచారం నిర్వహిస్తారు. కార్మికులను ఇతర సంఘాలను కలుపుకుని రైతులు వాహన జాతాలు, పాదయాత్రలు, మహాపంచాయత్‌లను నిర్వహిస్తారు. తమ రాష్ట్రాల్లో నెలకొన్న రైతుల సమస్యలను గుర్తించేందుకు, కేంద్ర కార్యాచరణ కార్యక్రమాలతోపాటు వారి ఆందోళన కార్యక్రమాలను రూపొందించేందుకు అన్ని రాష్ట్రాల్లో ఎస్‌కెఎం రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.



ఫైల్ ఫొటో

వైసిపి బిల్డింగ్ కూల్చివేత కేసులో నోటీసులు

- కౌంటర్ దాఖలు చేయాలని సిఆర్‌డిఎ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

వైసిపి ప్రధాన కార్యాలయ భవనాన్ని కూల్చివేయడాన్ని ఆ పార్టీ సవాల్ చేసిన కేసులో హైకోర్టు.. సిఆర్‌డిఎ కమిషనర్ కాటంనేని భాస్కర్, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్‌లకు నోటీసులిచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను ఆగస్టు 8కి వాయిదా వేసింది. కోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా కేంద్ర కార్యాలయ భవనం కూల్చివేత చర్యలు చేపట్టడం కోర్టు ధిక్కారమే అవుతుందంటూ వైసిపి గుంటూరు జిల్లా అధ్యక్షులు శేషగిరిరావు దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ చీమలపాటి రవి విచారణ జరిపారు.

నీట్ కేసులో కీలక నిందితుడు అరెస్టు

- 10 రోజులు సిబిఐ కస్టడీకి



కీలక నిందితుడు రాకీ

పాట్నా : నీట్-యుజి పేపర్ లీకేజీకి సంబంధించి కీలక నిందితుల్లో ఒకరైన రాకేష్ రంజన్ అలియాస్ రాకీని సిబిఐ గురువారం అరెస్టు చేసింది. ఈ కేసుకు సంబంధించి ఈ వారం ప్రారంభంలో బీహార్, జార్ఖండ్‌ల్లోని 15 ప్రాంతాల్లో సిబిఐ సోదాలు జరిపింది. లీకైన పరీక్షా ప్రశ్నాపత్రాల రాకెట్‌ను రంజన్ నడిపినట్లు తెలుస్తోంది. జార్ఖండ్‌లో అరెస్టు చేసి, గురువారం పాట్నా తీసుకొచ్చినట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి. పాట్నాలో ప్రత్యేక సిబిఐ కోర్టు ముందు రంజన్‌ను హాజరుపరచగా, విచారణ నిమిత్తం 10 రోజుల పాటు సిబిఐ కస్టడీకి పంపారు. నలంద జిల్లా హిలాస్ బ్లాక్‌లో రంజన్ గ్రామమైన గగేంద్ర బాఘాలో ఇంటిని జూన్ 30న సిబిఐ బృందం సోదాచేసింది. ఆ వార్డు సభ్యులైన ఇద్దరు వ్యక్తుల సమక్షంలో ఇంటి తాళాలు పగలగొట్టి మరీ ఈ తనిఖీలు చేపట్టారు. దాదాపు గంటపాటు సోదాలు చేయగా, హెచ్‌డిఎఫ్‌షి బ్యాంక్ చెక్ బుక్, ఓటర్ సమాచారం, పాన్ కార్డుతోపాటు కొన్ని పత్రాల జిరాక్స్ కాపీలను స్వాధీనం చేసుకున్నారు. నీట్ పేపర్ లీక్ అయిన తర్వాత పాట్నా, రాంచిలకు చెందిన ఎంబిబిఎస్ విద్యార్థులను సమాధానాలు రాసేందుకు రాకీ ఏర్పాటు చేసేవాడని సిబిఐ వర్గాలు చెప్పాయి. ఈ కేసులో సూత్రధారిగా భావిస్తున్న సంజీవ్ ముఖియాకు నమ్మ కస్తులైన ముఠా సభ్యుల్లో రాకీ కూడా ఒకడు. పైగా ముఖియాకు బంధువు కూడా. రాకీ అరెస్టుతో ఇప్పటివరకు బీహార్ పోలీసులు, ఆర్థిక నేరాల విభాగం, సిబిఐ అధికారులు 28మందిని అరెస్టుచేశారు. బీహార్ నుండే సిబిఐ 10ని అరెస్టు చేసింది. రాకీ నేపాల్‌కు పారిపోయేందుకు పథకం రచించాడని సిబిఐ వర్గాలు చెప్పాయి

రేషన్ బియ్యం అక్రమ తరలింపులో ఐపిఎస్‌లు

- బియ్యం, కందిపప్పు ప్రత్యేక కౌంటర్ ప్రారంభం
- పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

రాష్ట్రం నుండి విచ్చల విడిగా సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక ప్రకటన చేశారు. విజయవాడలో బియ్యం, కందిపప్పును తక్కువ ధరకు విక్రయించే ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించారు. ఎపిఐఐసి కాలనీ రైతు బజార్లో జరిగిన ఈ ప్రారంభ కార్యక్రమం అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన రేషన్ బియ్యం అక్రమ తరలింపులో ఐదుగురు ఐపిఎస్ అధికారుల పాత్ర ఉందని తెలిపారు. పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదోవ పట్టించే వారు ఎంతటివారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. కాకినాడలో 43,249 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేశామని తెలిపారు. దీనిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం రైతులకు రూ. 1,600 కోట్లు బకాయిపెట్టి వెళ్లిందని, తమ ప్రభుత్వం ఇటీవల రూ.1000 కోట్లు చెల్లించిందని, మిగిలిన రూ.600 కోట్లను త్వరలోనే చెల్లిస్తామని తెలిపారు. ధరల స్థిరీకరణపై రిటైల్ వర్తకులతో మంత్రి సమీక్షించారు.

రాష్ట్ర వ్యాప్తంగా 284 ప్రత్యేక కౌంటర్లు

అంతకుముందు ప్రత్యేక కౌంటర్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సామాన్యులకు సరసమైన ధరల్లో నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా బియ్యం, కందిపప్పును అందించేందుకు రైతు బజార్లలో 284 ప్రత్యేక కౌంటర్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కిలో కందిపప్పు రూ.160, కిలో బియ్యం స్టీమ్డ్ బిపిటి రకం రూ.49కు, బిపిటి రా రైస్ రకం రూ.48లకు అందించనున్నట్లు తెలిపారు.

సమస్యలపై పోరాటానికి సన్నద్ధం

ఎస్‌కెఎం సర్వసభ్య సమావేశం నిర్ణయం

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రైతులు, కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పోరాటానికి సిద్ధమైంది. ఎంఎస్‌పి చట్టం, రుణమాఫీ, పంటల బీమా, రైతులు, రైతు కార్మికుల పెన్షన్, విద్యుత్ ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవడం వంటి పెండింగ్‌లో ఉన్న ఇతర డిమాండ్లపై ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. కేంద్ర కార్మిక సంఘాలు, ఇతర ట్రేడ్ యూనియన్లు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళలు, ఇతర బహుజన వర్గాల సంఘాలతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని బుధవారం ఇక్కడ నిర్వహించిన ఎస్‌కెఎం సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. రాజస్థాన్‌లోని సికార్ నుంచి అమ్రారామ్, బీహార్‌లోని కరకట్ నుంచి రాజారామ్‌సింగ్, బీహార్‌లోని అర్రా నుంచి సుదామప్రసాద్, తమిళనాడులోని దిండిగల్ నుంచి ఆర్.సచ్చితానందం రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించారని, వారు ఎంపిలుగా గెలుపొందడం అభినందనీయమని పేర్కొంది. అధ్యక్షవర్గంగా అశోక్ ధావలే, దర్శన్ పాల్, యుధ్వీర్ సింగ్, బల్బీర్ సింగ్ రాజేవాల్, రావుల వెంకయ్య, మేధా పాట్కర్, సత్యవాన్, రుల్డు సింగ్ మాన్సా, సునీలం, అవిక్ సాహా, ఆశిష్ మిట్టల్, తాజిందర్ సింగ్ విర్క్, కన్వర్జిత్ సింగ్ వ్యవహరించారు. ఎఐకెఎస్ నేత హన్నన్ మొల్లా ప్రతినిధులకు స్వాగతం పలికారు. 17 రాష్ట్రాల నుంచి 143 మంది ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణను ఎస్‌కెఎం ప్రకటించింది.

ఇవీ డిమాండ్లు....

- అన్ని పంటలకు గ్యారెంటీ సేకరణతో సి2ప్లస్50 శాతంతో కూడిన ఎంఎస్‌పి చట్టబద్ధంగా హామీ ఇవ్వాలి
- రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణభారం నుండి విముక్తి కల్పించి రైతు ఆత్మహత్యలకు ముగింపు పలకడానికి సమగ్ర రుణమాఫీ చేయాలి
- విద్యుత్ రంగం ప్రైవేటీకరణ ఆపాలి. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు
- ప్రభుత్వ రంగం కింద అన్ని పంటలకు, పశుపోషణకు సమగ్ర బీమా కవరేజీ ఇవ్వాలి. రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల పిఎంఎఫ్‌బివై పథకాన్ని రద్దు చేయాలి
- రైతులు, వ్యవసాయ కార్మికులందరికీ నెలకు రూ.10 వేలు చొప్పున పెన్షన్ ఇవ్వాలి
- భూసేకరణ, పునరావాస చట్టం-2013ను అమలు చేయాలి. దేశం అంతటా ప్రతి సంవత్సరం భూమి సర్కిల్ రేటును సవరించాలి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగం ప్రాజెక్టుల కోసం అక్రమంగా సేకరించడం వల్ల భూమిని కోల్పోయిన వారందరికీ తగిన పరిహారం అందించాలి. బుల్డోజర్ రాజ్‌కు ముగింపు పలకాలి. ముందస్తు పునరావాస ఏర్పాట్లు చేయకుండా మురికివాడల, నివాసాల కూల్చివేతను ఆపాలి
- వ్యవసాయంలో కార్పొరేటీకరణ ఆపాలి. వ్యవసాయ ఉత్పత్తి, వాణిజ్యంలో బహుళజాతి కంపెనీలు వద్దు. వ్యవసాయంపై డబ్ల్యుటిఒ ఒప్పందం నుండి ఇండియా బయటకు రావాలి.
- ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, విద్యుత్, నీటిపారుదల, పెట్రోలియం ఉత్పత్తులు, యంత్రాలు, ట్రాక్టర్లు వంటి వ్యవసాయ ఇన్‌పుట్‌లపై జిఎస్‌టి ఆపాలి
- రాజ్యాంగంలోని సమాఖ్య సూత్రాల ప్రకారం పన్ను విధించే రాష్ట్ర ప్రభుత్వాల హక్కును నిర్ధారించడానికి జిఎస్‌టి చట్టాన్ని సవరించాలి
- జిడిపిలో తగిన వాటాతో వ్యవసాయం కోసం ప్రత్యేక కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలి
- కేంద్ర ప్రభుత్వంలో సహకార మంత్రిత్వశాఖను రద్దు చేయాలి. రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా సహకారాన్ని రాష్ట్ర అంశంగా ఉంచాలి. ఉత్పత్తి వర్గాలైన రైతులు, కార్మికుల ఖర్చుతో కార్పొరేట్ వర్గ ప్రయోజనాల కోసం అధికార కేంద్రీకరణను ప్రోత్సహించే బదులు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మద్దతు ఇవ్వాలి
- వన్యప్రాణుల ముప్పు కోసం శాశ్వత పరిష్కారాన్ని నిర్ధారించాలి. ప్రాణ నష్టానికి పరిహారంగా రూ.1 కోటి, పంటలు, పశువుల నష్టానికి తగిన పరిహారం అందించాలి
- లఖింపూర్ ఖేరీ అమరవీరులతో సహా చారిత్రాత్మక రైతుల పోరాట అమరవీరుల కుటుంబాలకు పరిహారం అందించాలి
- రైతుల పోరాటానికి సంబంధించిన అన్ని కేసులనూ ఉపసంహరించుకోవాలి. 736 మంది రైతు అమరవీరుల స్మారకార్థం సింగు, టిక్రీ సరిహద్దుల్లో అమరవీరుల స్మారకాన్ని నిర్మించాలి.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

- ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) ప్రధాన కార్యదర్శి బి వెంకట్ డిమాండ్ చేశారు. తెలంగాణలో బొగ్గు గనులు సింగరేణికి ఇవ్వాలని కోరారు. గురువారం నాడిక్కడ బి.వెంకట్ మీడియాతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విభజన చట్టంలోని అంశాలకు ప్రాధాన్యత కల్పించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా చూడాల్సిన బాధ్యత చంద్రబాబుదేనని, విశాఖ ఉక్కు తెలుగు ప్రజల హక్కు అని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మీడియాపై దాడులతో సమస్యలు పరిష్కారం కావని హితవు పలికారు. ఎపి, తెలంగాణ ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్ ఉత్పత్తి వర్గాలకు, సామాజిక తరగతులకు, ప్రజా అనుకులంగా, వెనుకబడిన ప్రాంతాలకు న్యాయం జరిగేలా ఉండాలని కోరారు. ఆ విధంగా ఒత్తిడి చేయాల్సిన బాధ్యత బిజెపి మిత్రపక్షాలైన టిడిపి, జెడియులపై మరింత ఉందని అన్నారు. నూతన క్రిమినల్ చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం రెండున్నర లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని, పట్టణ ఉపాధిహామీ పథకాన్ని తీసుకురావాలని, ఉపాధి హామీ కింద రోజుకు రూ.600 ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు కేంద్రచట్టం తీసుకురావాలని కోరారు. జులై 13 నుండి 15 వరకు తమిళనాడులోని తిరుచునాపల్లిలో ఎఐఎడబ్ల్యుయు అఖిల భారత కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని, దేశవ్యాప్త ఆందోళనకు ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు.



తెలుగు జాలర్ల శాంతియుత నిరసనలపై హింస దుర్మార్గం

- పోలీసుల దాడిని తీవ్రంగా ఖండించిన సిపిఎం
- అండమాన్ నికోబార్ ఎల్‌జికి రాష్ట్ర కార్యదర్శి లేఖ

పోర్ట్‌బ్లెయిర్ : తెలుగు భాష మాట్లాడే జాలర్లు శాంతియుతంగా చేసున్న నిరసనపై వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించడం తోపాటు దారుణంగా లాఠీఛార్జి చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర సిపిఎం ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి డి అయ్యప్పన్ లెఫ్టినెంట్ గవర్నర్‌కు లేఖ రాశారు. ఈ సంఘటనపై బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఫోర్ట్ బ్లెయిర్‌లో తెలుగు జాలర్ల కుటుంబానికి చెందిన 21 ఏళ్ల వి.విమల డెయిరీ కార్మికురాలిగా జీవిస్తోంది. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆమె స్థానికంగా ఉన్న జిబి పంత్ ఆసుపత్రిలో చేరింది. అక్కడ వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఆకస్మికంగా మరణించింది. వైద్యులు చేసిన ఇంజెక్షన్ వికటించినట్లుగా భావిస్తున్నారు. విమల కుటుంబానికి న్యాయం చేయాలని, తప్పు చేసిన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గోల్‌ఘడ్, ఇతర ప్రాంతాల్లో తెలుగు జాలర్లు గత కొన్ని రోజులుగా శాంతియుతంగా, ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలుపుతున్నారు. ఈ నెల 10వ తేదీ రాత్రి వీరిపై పోలీసులు లాఠీఛార్జికి పాల్పడ్డారు. శాంతియుతంగా నిరసన కొనసాగిస్తున్న వారిపై పోలీసులు ఏకపక్షంగా, వాటర్ కెనాన్, టియర్ గ్యాస్ షెల్స్ ఉపయోగిస్తూ దారుణంగా లాఠీఛార్జీ చేయడాన్ని లేఖలో కార్యదర్శి ఖండించారు. అండమాన్ నికోబార్ పరిపాలనలో కేంద్ర ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకోవడంతోనే లాఠీఛార్జి జరిగిందని విమర్శించారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మృతురాలికి ఏడాదిన్నర చిన్నారి కూడా ఉందనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని బాధిత కుటుంబానికి కనీసం రూ.20 లక్షల నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ లేఖ కాపీని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శికి, అండమాన్ నికోబార్ ప్రధాన కార్యదర్శి, డిజిపికి, ఆరోగ్యశాఖ కార్యదర్శికి అయ్యప్పన్ పంపించారు.



బాధితులతో మాట్లాడుతున్న రాహుల్

మణిపూర్ రెండుగా విడిపోయింది

- ప్రధాని మోడీ అక్కడ పర్యటించాలి :రాహుల్‌గాంధీ
- పర్యటన వీడియోను షేర్ చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నేత

న్యూఢిల్లీ : మణిపూర్ రాష్ట్రం రెండుగా విడిపోయిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. మణిపూర్‌లో తాను ఇటీవల పర్యటించిన ఐదు నిమిషాల వీడియోను ఆయన ఎక్స్‌లో గురువారం షేర్ చేశారు. మణిపూర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటించాలని, అక్కడి ప్రజల సమస్యలు వినాలని రాహుల్ విజ్ఞప్తి చేశారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పవలసిన అవసరం గురించి పార్లమెంట్‌లో కాంగ్రెస్, ఇండియా వేదిక పూర్తిస్థాయిలో డిమాండ్ చేస్తాయని తెలిపారు. 'మణిపూర్‌లో హింసాకాండ చెలరేగిన తరువాత నేను అక్కడ పర్యటించడం ఇది మూడోసారి. దురదృష్టవశాత్తు పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదు. ఈ రోజుకు కూడా మణిపూర్ రెండు భాగాలుగా విడిపోయి ఉంది' అని రాహుల్ గాంధీ తెలిపారు. వేలాది కుటుంబాలు సహాయక శిబిరాల్లోనే తలదాచుకుంటున్నాయని చెప్పారు. ఇళ్లు కాలిపోతున్నాయని, అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని తెలిపారు.

ఈ నెల 8న మణిపూర్‌లో రాహుల్‌గాంధీ పర్యటించి, అక్కడ సహాయక శిబిరాల్లో ఉంటున్న బాధితులతో మాట్లాడారు. తమను కలవడానికి అందరూ వస్తారు కానీ, ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రారని రాహుల్ వద్ద బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇళ్లకు వెళ్లాలని ఉందని చెప్పారు.

ప్రైవేట్ ఆపరేటర్లకు స్టేజ్ క్యారేజ్ పర్మిట్లా?

- వెంటనే రద్దు చేయండి
- హర్యానా ప్రభుత్వానికి ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ డిమాండ్

ఇండియా న్యూస్ నెట్‌వర్క్-న్యూఢిల్లీ

హర్యానాలో 362 మార్గాల్లో బస్సు సర్వీసులను నిర్వహించుకునేందుకు ప్రైవేటు ఆపరేటర్లకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలోని 362 మార్గాల్లో 3,658 స్టేజ్ క్యారేజ్ పర్మిట్లతో బస్సులను నిర్వహించుకోవడానికి అనుమతిస్తూ ఈ నెల 8న హర్యానా ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ అనుమతులను వెంటనే రద్దు చేయాలని ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మార్గాల్లో బస్సు సర్వీసులు నిర్వహించేలా హర్యానా రోడ్‌వేస్‌కు ఆదేశాలను ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నయబ్ సింగ్ సైనికి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య లేఖ రాశారు. ఇలాంటి అనుమతులతో రాష్ట్ర రోడ్‌వేస్ మరింత దిగజారిపోతాయని తెలిపారు. హర్యానా రోడ్‌వేస్ కార్మికులకు సంఘీభావం తెలపాలని, హర్యానా ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించాలని అన్ని రాష్ట్ర కమిటీలకు, ఫెడరేషన్లకు, యూనియన్లకు ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ విజ్ఞప్తి చేసింది. నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతిపత్రాన్ని కూడా ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ పంపింది.

జులై 3వ వారం నుండి కౌన్సెలింగ్

- సుప్రీంకు తెలిపిన కేంద్రం
- 18న పేపర్ లీకేజీలపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ



న్యూఢిల్లీ : వివాదాల్లో చిక్కుకున్న నీట్-యుజి కౌన్సెలింగ్ ప్రక్రియను నాలుగు దఫాలుగా జులై మూడవ వారం నుండి నిర్వహిస్తామని కేంద్రం గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఈ పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాల వల్ల ఎవరైనా విద్యార్థి లబ్ధి పొందినట్లు తెలిసిన పక్షంలో కౌన్సెలింగ్ ప్రక్రియ ఏ దశలో వున్నా, లేదా ముగిసినా కూడా దానితో సంబంధం లేకుండా వెంటనే సదరు విద్యార్థి అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తామని కేంద్ర ఉన్నత విద్యాశాఖ కోర్టుకు తెలియజేసింది. ఈ మేరకు 44 పేజీలతో అఫిడవిట్‌ను అందజేసింది.

ప్రశ్నా పత్రాల లీకేజీ, ఒకరి బదులు మరొకరు పరీక్ష రాయడం సహా ఇతర అక్రమాలు జరిగినట్లు నీట్ పరీక్షపై విమర్శలు వెల్లువెత్తాయి. మాస్ మాల్‌ప్రాక్టీస్‌పై ఐఐటి మద్రాసు ఇచ్చిన డేటా విశ్లేషణ నివేదికపై ప్రభుత్వం ఆధారపడింది. ప్రశ్నాపత్రాల లీకేజీ వల్ల లబ్ధి పొందిన వారిని గుర్తించేందుకు ఎన్‌టిఎ, కేంద్రం కసరత్తు చేయాల్సి వుంటే, ముందుగా కౌన్సెలింగ్ ప్రక్రియపై ప్రభుత్వం విధానస్థాయిలో నిర్ణయం తీసుకోవాలని ఈ నెల 8న సుప్రీం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. నీట్ పేపర్ లీకేజీపై దర్యాప్తు చేస్తున్న సిబిఐ ఇప్పటికే పలువురిని అరెస్టు చేసింది.

అఖిల భారత కోటాలో ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ రాష్ట్రాల వారీగా అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తుంది. రాష్ట్ర కోటాలో సీట్లను ఆయా రాష్ట్రాల కౌన్సెలింగ్ అధికారులే నిర్వహిస్తారు. అభ్యర్థులు చేసుకున్న ఎంపికకు అనుగుణంగా మొదటి, రెండవ రౌండ్ కౌన్సెలింగ్‌లో సీట్లను మార్చుకోవడానికి అనుమతిస్తారు. అక్రమాల వల్ల అభ్యర్థి లబ్ధి పొందారని తెలిసి సీట్ల కేటాయింపును రద్దు చేసినా, దానివల్ల మొత్తంగా కౌన్సెలింగ్ ప్రక్రియపై ఎలాంటి ప్రభావం వుండదు. సెప్టెంబరు రెండవ వారంలో మూడో రౌండ్ ఆరంభమవుతుందని భావిస్తున్నారు. ఆ తర్వాత గనక అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాల్సి వస్తే ఆ ఖాళీ సీట్లను తర్వాత రౌండ్‌లో భర్తీ చేస్తారు. ముందు రౌండ్లలో సీట్ల కేటాయింపు జరిగిన అభ్యర్థులు తర్వాత రౌండ్‌లో పాల్గొనడానికి అవకాశం వుండదని ప్రభుత్వం ఆ అఫిడవిట్‌లో వివరించింది. నాలుగు రౌండ్ల తర్వాత కూడా ఏ అభ్యర్థి సీటునైనా రద్దుచేయాల్సిన పక్షంలో ఆ ఖాళీ సీట్లను అదనపు కౌన్సెలింగ్ రౌండ్స్ నిర్వహించి భర్తీ చేస్తారని కేంద్రం తెలిపింది.

18న సుప్రీం విచారణ

నీట్ అక్రమాలపై ఎన్‌టిఎ, కేంద్ర ప్రభుత్వం గురువారం సుప్రీంకు అఫిడవిట్లు దాఖలు చేసిన నేపథ్యంలో నీట్ పేపర్ లీక్‌లపై విచారణను 18న చేపట్టాలని సుప్రీం నిర్ణయించింది. మే 4న టెలిగ్రామ్‌లో నీట్ పేపర్ లీక్ అయిందంటూ వచ్చిన వీడియో బూటకమని ఎన్‌టిఎ తన అఫిడవిట్‌లో పేర్కొంది. టైమ్‌స్టాంప్‌ను తప్పుగా చూపించారని పేర్కొంది. మే 5న సాయంత్రం 5.40 గంటలకు వున్న టైమ్‌స్టాంప్‌ను ముందుగానే లీక్ అయిందని చూపేలా ఎడిట్ చేశారని పేర్కొంది. నీట్ పరీక్ష నిర్వహణపై వచ్చిన పలు ఆరోపణలను ఎన్‌టిఎ తన అఫిడవిట్‌లో తోసిపుచ్చింది. గుజరాత్‌లోని గోద్రాలో ఒఎంఆర్ షీట్లను తారుమారు చేసేందుకు జరిగిన ప్రయత్నం భగ్నమైందని పేర్కొంది. ఇలాంటి అవకతవకలను మొదట్లోనే అడ్డుకుని, పరీక్షల పవిత్రతను కాపాడామని తెలిపింది.

యుజిసి-నెట్ స్క్రీన్‌షాట్‌పై చార్జిషీట్ దాఖలు?

న్యూఢిల్లీ : మార్పులు చేర్పులు చేసి యుజిసి-నెట్ ప్రశ్నా పత్రం స్క్రీన్ షాట్‌ను టెలిగ్రామ్‌లో అందరికీ పంపించిన వ్యక్తిపై సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసే అవకాశం వుంది. నిబంధనల ఉల్లంఘన జరిగే అవకాశం వుందంటూ కేంద్ర హోం శాఖ ముందుగా అప్రమత్తం చేయడంతో నెట్ పరీక్ష రద్దుకు ఈ స్క్రీన్‌షాట్ దారి తీసింది. మొత్తంగా ఈ అధ్యాయంలో పెద్ద ఎత్తున కుట్ర జరిగినట్లు సిబిఐ ఏదీ కనుగొనలేదు. అందువల్ల మోసం చేసేందుకు ప్రయత్నించిన నేరాలకే ఈ చార్జిషీట్‌ను పరిమితం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. స్క్రీన్ షాట్‌లో మార్పులు చేసింది స్కూలు విద్యార్థి అని అధికారులు చెప్పారు. ప్రభుత్వానికి తమ నిర్ధారణలను అనధికారికంగా సిబిఐ తెలియజేసింది. ఆ యువకుడిపై చార్జిషీట్ దాఖలు చేసే అవకాశం వుందని చెప్పారు. జూన్ 18న జరగాల్సిన ఈ పరీక్షకు 11లక్షల మందికి పైగా అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. కేంద్ర హోం శాఖ నుండి అలర్ట్ రావడంతో జూన్19న పరీక్ష రద్దు చేశారు. దర్యాప్తు బాధ్యతలను సిబిఐకి అప్పగించారు. యాప్‌ను ఉపయోగించి స్కూలు విద్యార్థి ఈ స్క్రీన్‌షాట్‌ను మార్చినట్లు సిబిఐ కనుగొంది. ప్రశ్నాపత్రం తనకు అందుబాటులోకి వచ్చిందనే అభిప్రాయం కలిగేలా ఆ వ్యక్తి స్క్రీన్‌షాట్ తేదీని జూన్ 17కి మార్చాడని, డబ్బుకోసమే ఇదంతా చేశాడని సిబిఐ అధికారులు తెలిపారు. సబ్జక్టుల వారీగా కూడా పేపర్లు ఇవ్వగలననే అభిప్రాయాన్ని కలిగించేందుకు ఆ వ్యక్తి ప్రయత్నించాడని తెలిపారు. దీనిపై ఫోరెన్సిక్ నిపుణుల సలహాను కూడా సిబిఐ తీసుకుంది.

ఢిల్లీ యూనివర్శిటీలో బోధనాంశంగా మనుస్మృతి !

- తీవ్రంగా నిరసించిన టీచర్స్ ఫ్రంట్

న్యూఢిల్లీ : ఢిల్లీ యూనివర్శిటీ (డియు)లో ఎల్‌ఎల్‌బి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో మనుస్మృతిని బోధనాంశంగా ప్రవేశపెట్టేందుకు ఢిల్లీ యూనివర్శిటీలోని లా ఫ్యాకల్టీ సిద్ధమైంది. జ్యూరిస్‌ప్రూడెన్స్ (లీగల్ మెథడ్)గా పిలిచే కేటగిరీ కింద దీన్ని తీసుకురానున్నారు. సామాజిక, ఆర్థిక, లింగ అసమానతలను ప్రేరేపించే, మరింత బలోపేతం చేసే ఈ వివాదాస్పదమైన సబ్జెక్టును వర్శిటీలోని ఫ్యాకల్టీకి చెందిన కొన్ని వర్గాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి. సవరించిన సిలబస్ డాక్యుమెంట్‌లో మనుస్మృతిని ప్రవేశపెడతారు. దీన్ని అమలు చేసేందుకు అనుమతించే నిమిత్తం ఈ సిలబస్ ప్రతిని శుక్రవారం ఢిల్లీ వర్శిటీ అకడమిక్ కౌన్సిల్ ఫర్ అకడమిక్ మేటర్స్ ముందు వుంచుతారు. ఇది ఆమోదం పొందిన వెంటనే ఇక, ఎల్‌ఎల్‌బి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో సెమిస్టర్ 1లో యూనిట్ 5-అనలిటికల్ పాజిటివిజమ్ కింద మనుస్మృతిని జి.ఎన్.ఝా రాసిన మనుభాష్య మేధాతిథితోపాటు కలిపి ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు చదువుతారు. భారతీయ దృక్కోణాలను, దృక్పథాలను బోధనా రంగంలో ప్రవేశపెట్టేందుకే నూతన విద్యా విధానం 2020కి అనుగుణంగా ఈ మనుస్మృతిని తీసుకువచ్చినట్లు ఫ్యాకల్టీ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ అంజు వలీ టికూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు తెలిపారు.

మనుస్మృతి మహిళలు, అట్టడుగువర్గాల ప్రగతికి ప్రతికూలం : విసికి టీచర్స్ ఫ్రంట్ లేఖ

ఈ నిర్ణయాన్ని సోషల్ డెమొక్రటిక్ టీచర్స్ ఫ్రంట్ తీవ్రంగా నిరసించింది. ఈ మేరకు ఢిల్లీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ యోగేష్ సింగ్‌కు లేఖ రాసింది. సమాజంలో మహిళలు, అట్టడుగు వర్గాల ప్రగతికి, విద్యకు ఇది పూర్తి ప్రతికూలంగా వున్నందున ఈ చర్య పట్ల తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు ఆ లేఖలో తెలియచేసింది. "ఈ దేశంలో 85శాతం జనాభా అట్టడుగు వర్గాలకు చెందినవారే, 50శాతం జనాభా మహిళలే. వీరి పురోగతి ప్రగతిశీల విద్యావ్యవస్థపై, బోధనా విధానంపై ఆధారపడి వుంటుంది. మనుస్మృతిలోని పలు సెక్షన్లు మహిళల విద్యకు, సమాన హక్కులకు పూర్తి వ్యతిరేకంగా వుంటాయి. మనుస్మృతిలోని ఏ ఒక్క భాగాన్ని లేదా సెక్షన్‌ను ప్రవేశపెట్టడం మన రాజ్యాంగం మౌలిక స్వరూపానికి, రాజ్యాంగ విలువలకు పూర్తి విరుద్ధం." అని ఆ లేఖ పేర్కొంది.

కేంద్ర బడ్జెట్‌పై సలహాలు, సూచనలకు ఆర్థికవేత్తలతో మోడీ భేటీ



ఆర్థిక వేత్తల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ : ఈ నెలలో ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్‌కు సంబంధించి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకునేందుకు ప్రధాని మోడీ గురువారం ప్రముఖ ఆర్థికవేత్తలతో భేటీ అయ్యారు. జులై 23న లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఫిబ్రవరిలో తాత్కాలిక బడ్జెట్‌ను సమర్పించారు. ఆర్థికవేత్తలు, రంగాలవారీ నిపుణులతోపాటు నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ, ఇతర సభ్యులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో మంత్రి నిర్మలా సీతారామన్, ప్రణాళికా శాఖ మంత్రి ఇందర్‌జిత్ సింగ్, ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్, ఆర్థికవేత్తలు సూర్జిత్ భల్లా, అశోక్ గులాటి, ప్రముఖ బ్యాంకర్ కెవి కామత్ ప్రభృతులు పాల్గొన్నారు. 2047కల్లా అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తయారుచేయడానికి అనుసరించే ప్రణాళికకు ఈ బడ్జెట్‌లో రూపకల్పన చేస్తారని భావిస్తున్నారు. సంస్కరణల వేగాన్ని మరింత పెంపొందించేందుకు ఈ ప్రభుత్వం చారిత్రక చర్యలతో వస్తుందని గత నెలలో పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. ఇప్పటికే పారిశ్రామిక, వాణిజ్య వర్గాలతో, ఆర్థికవేత్తలతో మంత్రి నిర్మలా సీతారామన్ చర్చలు జరిపారు. సామాన్యుడికి ఆదాయపు పన్ను ఉపశమనం కలిగించాలని పలువురు నిపుణులు ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరారు. 2023-24లో భారత ఆర్థిక వ్యవస్థ 8.2శాతం వృద్ధిరేటును నమోదు చేసింది.

యుద్ధాన్ని కాదు బౌద్ధాన్ని ఇచ్చాం

- వియన్నాలో మోడీ

వియన్నా : ప్రపంచానికి భారతదేశం 'బౌద్ధాన్ని' ఇచ్చింది కానీ 'యుద్ధం'ను కాదని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. అంటే శాంతి, సంక్షేమాలే భారతదేశం ఎప్పుడూ ఇస్తూ వచ్చిందన్నారు. తద్వారా 21వ శతాబ్దంలో భారత్ తన పాత్రను మరింత బలోపేతం చేసుకుంటోందని చెప్పారు. వియన్నాలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించారు. అత్యుత్తమమైన, ప్రకాశవంతమైన దేశంగా నిలిచేందుకు భారత్ కృషి చేస్తోందని, అతిపెద్దవైన మైలురాళ్లను దాటుతూ సమున్నతమైన లక్ష్యాలను సాధిస్తోందన్నారు. "వేల సంవత్సరాలుగా, మనం మన విజ్ఞానాన్ని, అనుభవాలను ఇతరులకు పంచుతున్నాం. మనం యుద్ధాన్ని ఇవ్వలేదు, బౌద్ధ తత్వాన్ని ఇచ్చాం." అని మోడీ పేర్కొన్నారు. మాస్కోలో రెండు రోజుల పర్యటన ముగించుకుని వియన్నా వచ్చిన మోడీ ఇక్కడి భారతీయులను కలుసుకుని వారితో మాట్లాడారు. ఆస్ట్రియాలో తన మొదటి పర్యటన అర్థవంతంగా జరిగిందన్నారు. భారత్, ఆస్ట్రియాల మధ్య 75ఏళ్ల స్నేహ బంధానికి గుర్తుగా 41ఏళ్ల తర్వాత భారత ప్రధాని ఈ దేశాన్ని సందర్శించారని మోడీ వ్యాఖ్యానించారు. రెండు దేశాలు భౌగోళికంగా భిన్నమైనవి అయినప్పటికీ ప్రజాస్వామ్యం రెండింటినీ కలుపుతోందన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, బహుళవాదం, చట్టబద్ధ పాలన పట్ల గౌరవం ఇవన్నీ మనం పంచుకునే విలువలని అన్నారు. మన సమాజాలు బహుళ సంస్కృతులతో సమ్మిళతమైనవని అన్నారు. వైవిధ్యత రెండు దేశాల్లో కనిపిస్తుందన్నారు. అంతకుముందు ఆస్ట్రియాలోని భారతీయులు మోడీకి సాదరంగా స్వాగతం పలికారు.

ఢిల్లీ చేరుకున్న మోడీ

రష్యా, ఆస్ట్రియాల్లో పర్యటన ముగించుకుని ప్రధాని మోడీ గురువారం ఢిల్లీ చేరుకున్నారు. ఈ పర్యటన చారిత్రకమైనదిగా, మంచి ఫలితాలను అందించినదిగా అభివర్ణించారు.

పాన్‌మసాలా ప్యాకేజీలపై హెచ్చరిక లేబుల్ పెంచాల్సిందే : ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : పాన్‌మసాలా ప్యాకేజీలపై 50 శాతం హెచ్చరిక లేబుల్ అవసరమని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. పాన్ మసాలాలపై 3 మిల్లీమీటర్లు ఉండే ఫాంట్ సైజ్‌ను పెంచాలని ఈ ఏడాది మేలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) నిబంధనలు జారీ చేసింది. ఈ నిబంధనలను సవాలు చేస్తూ రజనీగంధ, తాన్‌సేన్, మస్తాబా తదితర ప్రసిద్ధ పాన్ బ్రాండ్‌ల తయారీదారులు ధర్మపాల్ సత్యపాల్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టింది. చట్టబద్ధమైన హెచ్చరిక పరిమాణం గణనీయంగా పెంచాలనే అంశానికి శాస్త్రీయంగా ఎటువంటి ఆధారం లేదని కంపెనీలు చేసిన వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది. అత్యధిక ప్రజానీకానికి రక్షణ కల్పించే ఉద్దేశంతోనే ఈ ఏడాది మే నుంచి హెచ్చరికల పరిమాణాన్ని 50 శాతం పెంచాలని నిర్ణయించామన్న ఎఫ్ఎస్ఎస్ఎఐ చేసిన వాదనను ఢిల్లీ హైకోర్టు సమర్థించింది.

ఆసియాలో గందరగోళాలు సృష్టించొద్దు

- ఉక్రెయిన్ యుద్ధంపై నాటో వ్యాఖ్యలను ఖండించిన చైనా

బీజింగ్ : ఇతరుల భద్రతను పణంగా పెట్టి నాటో తన భద్రతను కోరుకుంటోందని చైనా విమర్శించింది. ఆసియాలో కూడా ఇటువంటి గందరగోళాలు తీసుకురావద్దని నాటోకు స్పష్టం చేసింది. ఉక్రెయిన్‌పై రష్యా జరుపుతున్న యుద్ధంలో నిర్ణయాత్మక పాత్ర చైనాదే అని నాటో ఆరోపించడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన జారీ చేసింది. "ఉక్రెయిన్ విషయంలో చైనా బాధ్యతను నాటో హైప్ చేస్తోంది. ఇది ఏ మాత్రమూ సహేతుకం కాదు. పైగా ఇందులో నీచపుటెత్తుగడలు వున్నాయి." అని విదేశాంగ ప్రతినిధి లిన్ జియాన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ విషయంలో చైనా చాలా న్యాయమైన, నిష్పాక్షికమైన వైఖరి తీసుకుందన్నారు. 'ఉక్రెయిన్‌పై రష్యా దాడిని ఖండించడానికి చైనా వ్యతిరేకించింది. పైగా దాడి జరిగినప్పటి నుండి రష్యాతో చైనా వాణిజ్యం పెరిగింది. పశ్చిమ దేశాల ఆంక్షలను పాక్షికంగానైనా తగ్గించేందుకు ఇది దోహదపడింది. రష్యాతో 'అవధుల్లేని భాగస్వామ్యం' ద్వారా చైనా ఈ యుద్ధానికి అవకాశం కల్పించిందని' నాటో బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రష్యాతో చైనా వాణిజ్యం చట్టబద్ధమైనది, సహేతుకమైనదని లిన్ సమర్థించారు. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగానే జరిగిందన్నారు. నాటో విస్తరణ చర్యల వల్ల రష్యాకు ముప్పు ఎదురవుతుందన్న రష్యా వాదనను చైనా సమర్థిస్తుందని చెప్పారు. ఇతర దేశాల భద్రతను పణంగా పెట్టి నాటో తన భద్రతను చూసుకుంటోందని విమర్శించారు.

యుపిని వణికిస్తున్న వరదలు

వేర్వేరు ప్రాంతాల్లో పిడుగుపాటుకు గురై 38 మంది మృతి



లక్నో : ఉత్తర ప్రదేశ్‌లోని ఆరు జిల్లాలను వరదలు ముంచెత్తుతున్నాయి. బుధవారం ఒక్కరోజే పలు జిల్లాల్లో పిడుగుపాటుకు గురై 38 మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యధికంగా ప్రతాప్‌గఢ్ జిల్లాలో 11 మంది మరణించారని అధికారులు తెలిపారు. సుల్తాన్‌పూర్‌లో ఏడుగురు, చందౌలీలో ఆరుగురు, మెయిన్‌పురిలో ఐదుగురు, ప్రయాగరాజ్‌లో నలుగురు మరణించారు. వారణాసి, హత్రాస్, ఔరియా, డియోరియా జిల్లాల్లో ఒక్కొక్కరు మరణించారని, వివిధ ప్రాంతాల్లో చాలామంది గాయాల పాలయ్యారని అధికారులు పేర్కొన్నారు. మృతుల్లో ఎక్కువమంది 15 ఏళ్లలోపు వారేనని తెలిపారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల మధ్య ఉరుములతో కూడిన భారీ వర్షం పడింది. ఆ నఉత్తర ప్రదేశ్‌లోని బలరాంపూర్, శ్రావస్తి, బస్తీ, గోరఖ్‌పూర్, బల్లియా జిల్లాలను వరదలు ముంచెత్తుతున్నాయి.

నేపాల్ నుంచి ప్రవహిస్తున్న రప్తీ నది వరద ప్రమాదకర స్థితికి చేరడంతో బలరాంపూర్ జిల్లాల్లో 60కిపైగా గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. వరద నీటిలో మునిగి ఇప్పటివరకూ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరాఖండ్ డ్యామ్‌ల నుంచి నీటిని విడిచిపెట్టడంతో పలు జిల్లాల్లో ఒకటి నుంచి మూడడుగుల వరకూ నీరు చేరింది. 32 ఫ్లడ్ పోస్టులను ఎస్‌డిఆర్ఎఫ్ ఏర్పాటు చేసిందని, సహాయక చర్యలు చేపడుతున్నామని సంబంధిత అధికారులు తెలిపారు.

శ్రావస్తిలో సిఎం ఆదిత్యనాథ్ ఏరియల్ సర్వే

వరదలకు గురైన శ్రావస్తి జిల్లాలో యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఏరియల్ సర్వే నిర్వహించారు. సహాయ సామగ్రి పంపిణీలో పాల్గొన్నారు.

ఆర్థిక హబ్‌గా భోగాపురం

(మొదటి పేజీ తరువాయి)

సిఐఐ ఆలిండియా కౌన్సిల్ ప్రతినిధులతో వర్చువల్‌గా ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ పబ్లిక్ ప్రయివేట్ పీపుల్స్ పార్టనర్ షిప్ (పిపిపిపి) కింద పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రానికి రావాలని కోరారు. విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో గ్లోబల్ మెడ్ టెక్ యూనివర్సిటీని, సైక్లో ట్రాన్ సెంటర్లను ఈ సందర్భంగా ప్రారంభించారు.

గిరిజన యూనివర్శిటీ... రైల్వేజోన్ పై

గిరిజన యూనివర్సిటీకి గతంలో ఎక్కడైతే స్థలం ఇచ్చామో పనులు అక్కడే మొదలు పెడతామని చెప్పారు. రైల్వే జోన్‌కు అవసరమైన భూమి ఇవ్వలేదనే వివాదం ఉందని, వారికి ఆమోదయోగ్యమైన స్థలం ఇచ్చి రైల్వే జోన్ పనులను చేపడతామని తెలిపారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. దక్కన్ క్రానికల్ కార్యాలయం ఎదుట ఇటీవల టిడిపి శ్రేణుల నిరసనలనుద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ, తప్పు చేసిన వారి ఆఫీసుల వద్ద నిరసనలు అవసరం లేదని, చట్టప్రకారం ముందుకెళదామని సూచించారు.




మీకోసం

పిండేసిన నిమ్మ తొక్కలను పడేయకుండా స్టవ్‌పై రుద్ది కడిగేస్తే జిడ్డు లేకుండా శుభ్రమవుతుంది.

జీవన సౌరభం

అవకాశాల కోసం ఎదురుచూస్తూ ఉండకూడదు. అవకాశాలను కల్పించుకొని లక్ష్యాన్ని సాధించుకోవాలి.

నల్లేరు మీద నడక



పూర్వం చామలాపల్లి అగ్రహారంలో ఉన్న పెద్ద బుగత గారి కుటుంబం ఒకసారి పట్నం వెళ్ళవలసి వచ్చింది. రవాణా సౌకర్యాలు లేని ఆ రోజుల్లో దూర ప్రాంతాలకు ఎడ్ల బండి మీద వెళ్ళేవారు. పాలేరుని పిలిచి 'మేమంతా పట్నానికి వెళ్ళాలి.. బండిని సిద్ధం చేయి' అన్నారు బుగత.

'సరే బాబు' అని బండిలో చాపను పరిచి మెత్తగా ఉండటానికి వట్టి గడ్డిని వేశాడు. ఎండకు, వానకు తడవకుండా గూడుని సిద్ధం చేశాడు. ఎడ్లకు గడ్డి వేసి నీళ్ళు పట్టాడు. నల్లేరు తీగలు బండికి అడుగుభాగాన భద్రపరిచి ప్రయాణానికి సిద్ధం చేశాడు. కాసేపటి తర్వాత బుగత కుటుంబం గూడుబండిలో పట్నానికి బయలు దేరింది. కొంత దూరం ప్రయాణం చేసాక బండిని ఆపి, కిందకి దిగాడు పాలేరు.

'బండిని ఎందుకు ఆపావు?' అని అడిగాడు బుగత గారి మనవడు. 'ఇక్కడ పెద్ద గొయ్యి ఉంది. ఆ గోతిలోంచి బండి వెళితే ఇరుసు విరిగిపోతుంది. అంతేకాక బండి భారీ కుదుపుకు లోనై కూర్చున్నవారికి నడుం నొప్పి వస్తుంది అందుకే ఆపాను' అన్నాడు పాలేరు. 'మరేం చేస్తావు ఇప్పుడు' అని అడిగాడు బుగత గారి మనవడు.


'నేను తీసుకు వచ్చిన నల్లేరు తీగలను గోతిలో ఉంచుతాను. దాని వల్ల బండి సాఫీగా వెళ్తుంది, ఎలాంటి కుదుపులూ ఉండవు' అని చెప్పి నల్లేరును గోతిలో ఉంచి బండిని ముందుకు పోనిచ్చాడు పాలేరు. పాలేరు చెప్పినట్లు గానే ఎటువంటి కుదుపులు లేకుండా వారి ప్రయాణం సాఫీగా సాగింది. పాలేరు తెలివికి మెచ్చుకున్నారు బుగత గారు. నాటి నుంచి నల్లేరు నుపయోగించి ఎంతదూరం అయినా కుదుపులు లేకుండా హాయిగా ప్రయాణం చేసేవారు. అలా 'నల్లేరు మీద నడక' అనే జాతీయం వాడుకలోకి వచ్చింది.

ఏదైనా పని లేదా కార్యం, సునాయాసంగా జరిగినప్పుడు, ప్రయాణం లేదా జీవితం సాఫీగా సాగినప్పుడు నల్లేరు మీద నడక అనే జాతీయాన్ని ఉపయోగిస్తున్నాము. ఇక నల్లేరు విషయానికి వస్తే దారిపొడవునా తాటి చెట్ల పైకి తీగలా ప్రాకుతూ కనిపిస్తుంది. ఇది ఆకుపచ్చగా మెత్తగా స్పాంజి వలె ఉంటుంది. ఎన్నో ఔషధ గుణాలు కలిగి ఉంటుంది.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445

బొమ్మ గీయండి!

పిల్లలూ, 4వ నెంబరు ఉపయోగించి తిమింగం బొమ్మ గీయడం ఈ రోజు నేర్చుకుందామా? ఇచ్చిన అంకెల ఆధారంగా బొమ్మ గీయండి.



నేను గీసిన బొమ్మ





జి.హాసిని,
9వ తరగతి,
సెయింట్ మేరీ విద్యానికేతన్ హైస్కూలు,
గజ్వేల్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రోగ నిరోధక శక్తి ఎలా పెరుగుతుందంటే...

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఉరుకులు, పరుగుల జీవితాన్ని గడుపుతున్నారు. ఆహారం, జీవన శైలిలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అందువల్ల చాలామందిలో రోగ నిరోధక శక్తి నానాటికీ తగ్గిపోతోంది. వంశపారంపర్యం, రుతువు, మనుషుల ఆధారంగా వ్యాధి నిరోధక శక్తిలో మార్పులు వస్తుంటాయి. ఇమ్యూనిటీని పెంచుకోవటం ద్వారా వయసు రీత్యా పెరిగి, తరిగే వ్యాధి నిరోధక శక్తిని సరిదిద్ది సంవత్సరం మొత్తం సమంగా ఉండేలా చేయొచ్చు. రుతువులను బట్టి జీవన దశలను బట్టి వ్యాధి నిరోధక శక్తిలో మార్పులు వస్తూ ఉంటాయి. పని ఒత్తిడి, పెయిన్ మేనేజ్‌మెంట్, అధిక బరువు నియంత్రణ, గైనకాలజీ సమస్యలతో పాటుగా జ్వరాలు, టైఫాయిడ్, మలేరియా, అతిసార, అర్థరైటిస్, స్పాండిలైటిస్ వంటివి సులభంగా తగ్గించుకోవచ్చు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక వ్యాధులెన్నింటినో శాస్త్రీయ వైద్య పద్ధతుల్లో తగ్గించుకోవచ్చు.

ఇమ్యూనిటీ ఎలా పెరుగుతుందంటే...

ప్రతిఒక్కరూ ఒక క్రమబద్ధమైన జీవిత శైలిని అలవర్చుకోవాలి. నియమబద్ధమైన అంటే సమతులమైన పౌష్టికాహారాన్ని తీసుకోవటం మంచిది. తద్వారా రోగ నిరోధక శక్తి (ఇమ్యూనిటీ పవర్) పెరుగుతుంది. కరోనా సమయంలో వైరస్ నుండి సంరక్షించడంలో ఇమ్యూనిటీ ముఖ్య పాత్ర పోషించింది. విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవటం ద్వారా రోగనిరోధక శక్తిని బలోపేతం అవుతుంది. రోగనిరోధక శక్తి అనేక రకాల పోషకాలను కలిగి ఉంటుంది. విటమిన్ సి మాత్రమే కాకుండా మంచి ఆరోగ్యానికి అవసరమైన అన్ని పోషకాలు సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం అవసరం.





ఒత్తిడులకు దూరంగా ఉండాలి

ఏడాది పొడవునా శరీరం చురుగ్గా ఉండాలంటే సూక్ష్మపోషకాలు చాలా అవసరం. అన్ని సూక్ష్మ పోషకాలు ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంటాయి. ఆహారంలో అవి తగినంతగా లేనప్పుడు రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. పాల ఉత్పత్తులు, మాంసాహార ఉత్పత్తులు, తృణధాన్యాలు, మిల్లెట్లను ఆహారంలో చేర్చుకోవాలి. శరీరానికి అవసరమైన పోషకాలను అందించాలి. సూక్ష్మపోషకాలతో పాటు, ప్రతిరోజూ ఫైబర్, నీరు అధికంగా ఉండే ఆహారాన్ని తినడం సమతుల్య శారీరక శ్రమను నిర్వహించడానికి సహాయ పడుతుంది. ఉదయం నిద్ర లేచిన వెంటనే కాసేపు వ్యాయామం చేయాలి.




వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవడానికి ఈ దిగువ ఆహారపదార్థాలు దోహదపడతాయి

- పాల ఆధారిత ఉత్పత్తులైన పాలు, జున్ను, పెరుగు, పాల పొడి
- సోయా పాలు, దాని ఉత్పత్తులు
- ప్రోబయోటిక్స్ సమృద్ధిగా ఉండే తృణధాన్యాలు, పోషకాహార పదార్థాలు
- విటమిన్ ఇ అధికంగా ఉండే ఆహారాలు
- బాదం, వేరుశెనగ వంటి గింజలు
- పొద్దుతిరుగుడు వంటి విత్తనాలు
- గోధుమ గింజల చమురు, పొద్దుతిరుగుడు నూనె, సోయాబీన్ నూనె

ధాన్యపు అల్పాహారాలు

- మాంసాహారం కూడా తినటం మంచిదే
- విటమిన్ ఎ సమృద్ధిగా ఉన్న ఆహారాలు
- క్యారెట్లు, కాప్సికం, బీట్‌రూట్, కీరదోస, కూరగాయలు, ఆకుకూరలు.



చర్మం పొడిబారకుండా ...

వర్షాకాలం తరచూ చర్మ సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. ముఖ్యంగా పొడి చర్మం ఉన్నవారికి చర్మ రంధ్రాలు మూసుకుపోయి సమస్యలు వస్తాయి. జిడ్డు చర్మం వారికి కూడా మొటిమలు రావడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. వీటన్నింటి నుంచి చర్మాన్ని కాపాడుకోవడానికి కొన్ని చిట్కాలను పాటించవచ్చు.

- చర్మ తత్వం ఎలాంటిదైనా దాన్ని తేమగా ఉంచుకోవడం ఎంతో అవసరం. అందుకే వర్షాకాలంలో నీళ్లు తాగాలనిపించకపోయినా అప్పుడప్పుడూ తాగుతూ ఉండాలి. డీహైడ్రేషన్ వల్ల చర్మం పొడిబారిపోయి పగుళ్లు ఏర్పడుతుంటాయి. ఆ సమస్య నుంచి చర్మాన్ని కాపాడుకోవాలంటే రోజంతా కొద్దికొద్దిగా నీళ్లు తాగుతూ ఉండాలి.
- మాయిశ్చరైజర్ అలవాటు ఉన్నవారు వర్షాకాలంలో కూడా తరచూ చర్మాన్ని, ముఖ్యంగా ముఖాన్ని మాయిశ్చరైజర్ చేస్తుండాలి. జెల్ బేస్డ్ మాయిశ్చరైజర్ ఈ కాలం బాగా పనిచేస్తుంది. పొడిబారిపోయే చర్మం గలవారు క్రీమ్ బేస్డ్ మాయిశ్చరైజర్ ఉపయోగించవచ్చు.
- స్నానానికి చల్లనీళ్లు లేదా గోరు వెచ్చని నీటిని మాత్రమే ఉపయోగించాలి. వేడి నీటితో చేయడం వల్ల చర్మం నుంచి మరింత తేమను లాగేస్తాయి. అంతేకాదు చర్మం చివరలో ఉన్న రక్తనాళాలను కూడా దెబ్బతినేలా చేస్తాయి. సాధ్యమైనంత వరకు వేడి నీటి స్నానానికి దూరంగా ఉండాలి.
- వర్షాకాలంలో వీలైనంతగా తక్కువగా మేకప్ వేసుకోవడం మంచిది. వాటర్ ప్రూఫ్ మేకప్ వేసుకుంటారు కాబట్టి మంచి క్లెన్సర్ సాయంతో రోజూ మేకప్‌ని తొలగించడం అత్యవసరం. అయితే ఎంచుకునే పదార్థాలు చర్మాన్ని పొడిబారకుండా కాపాడేవిగా ఉండాలి.
- తీసుకునే ఆహారంలో తాజా కూరగాయలు, పండ్లు ఎక్కువగా ఉండాలి. దీంతో పాటు ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి.



నేడు 'భారతీయుడు-2' విడుదల

తమిళ హీరో కమల్‌హాసన్ నటించిన చిత్రం 'భారతీయుడు2'. గురువారంనాడు ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. డైరెక్టర్ ఎస్.శంకర్ ఈ సినిమాను తెరకెక్కించారు. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్స్ మూవీ బ్యానర్లపై శుభకరణ్, ఉదయనిధి స్టాలిన్ నిర్మించారు. ఈ సినిమాలో సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్‌సింగ్, ఎస్‌జె సూర్య కీలకపాత్రలు పోషించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందించారు. దేశంలో లంచాలు తీసుకునే అధికారులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వ్యక్తి కథతో రూపొందిన చిత్రమే 'భారతీయుడు'. 1996లో విడుదలైన ఈ సినిమా అప్పట్లో సంచలన విజయాన్ని సాధించింది. తాజాగా అలాంటి కథతోనే దీనికి సీక్వెల్‌గా రాబోతున్న చిత్రమే 'భారతీయుడు2'.



సామాజిక సేవా కార్యక్రమాలూ చేస్తున్నా
వివేక్ ఒబెరాయ్


తాను చేసే సేవా కార్యక్రమాలకు ఎవరినీ డబ్బులు అడగకూడదనే ఉద్దేశ్యంతోనే సినిమాలతోపాటు, వ్యాపారాలు కూడా చేస్తున్నానని బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ వెల్లడించారు. రోహిత్‌శెట్టి దర్శకత్వంలో ఆయన నటించిన వెబ్‌సిరీస్ 'ఇండియన్ పోలీస్ ఫోర్స్'లో సిదార్థర్థ్ మల్హోత్ర, శిల్పాశెట్టి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సందర్భంగా జరిగిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.'బృందావన్ పాఠశాలను నడపటంతోపాటు, క్యాన్సర్ బాధితులకు సాయం చేస్తున్నా. సమాజానికి సేవ చేయటమనేది నా జీవితంలో భాగమైంది. అందుకే ఆర్థికంగా భద్రత ఉండటం అవసరం. డబ్బు కోసం ఎప్పుడూ ఎవరినీ చేయిచాసి అడగకూడదనుకున్నా. పలు వ్యాపారాల్లో భాగస్వామిగా ఉన్నా. కొన్ని టెక్నాలజీ సంస్థలు మంచి స్థాయికి చేరుకున్నాయి' అని వివరించారు.

నటుడిగా బాలకృష్ణ అరుదైన రికార్డు



నందమూరి బాలకృష్ణ నటుడిగా 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అరుదైన ఘనతను సాధించారు. ఇటు సినిమాల్లోనూ, అటు రాజకీయాల్లోనూ ఆయన తనదైన ప్రత్యేక శైలి చూపిస్తున్న విషయం తెలిసిందే. ఆగస్టు 30 నాటికి ఆయన నటుడిగా 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నారు. బాలకృష్ణ నటించిన మొదటి సినిమా 'తాతమ్మ కల' ఆగస్టు 30, 1974లో విడుదలైంది. ఆయన తండ్రి, నటుడు కీర్తిశేషులు నందమూరి తారకరామారావు ఈ సినిమాకు దర్శకత్వం వహించటమే కాకుండా ప్రధాన పాత్ర పోషించారు. ఇదే సినిమాలో నందమూరి హరికృష్ణ కూడా నటించారు. నటుడిగా 50 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా చిత్ర పరిశ్రమ ప్రతినిధులు ఆయన్ను ఘనంగా సన్మానించనున్నట్లుగా ప్రకటించారు. ప్రస్తుతం బాలకృష్ణ, బాబ్జీ కొల్లి (కెఎస్ రవీంద్ర) దర్శకత్వం చేస్తున్న సినిమా చిత్రీకరణ దశలో ఉంది. ఈ సినిమా తర్వాత బోయపాటి శ్రీనుతో 'అఖండ2' చేయబోతున్నారు.

గౌతమ్ మీనన్ దర్శకత్వంలో సమంత



'ఏమాయ చేశావే' సినిమాతో గౌతమ్ మీనన్ సమంతని టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయం చేశారు. ఆ తరువాత 'ఎటో వెళ్లిపోయింది మనసు' చిత్రంలో కూడా ఆమెకు ఛాన్స్ ఇచ్చారు. ఇప్పుడు మరోసారి గౌతమ్ మీనన్ చిత్రంలో సమంత నటిస్తోంది. తాజా సమాచారం ప్రకారం సమంత ఓ మలయాళం సినిమాకు ఒప్పుకున్నారు. గౌతమ్ మీనన్ కెరీర్‌లో మొదటిసారిగా దర్శకుడిగా ఓ మలయాళ సినిమా చేస్తున్నారు. ఈ సినిమాలో మమ్ముట్టి హీరోగా నటిస్తుండగా సమంత ఓ కీలక పాత్రలో నటిస్తుందని తెలుస్తోంది.

వెంకీ చిత్రంలో ఉపేంద్ర లిమాయే



వెంకటేశ్‌తో అనిల్ రావిపూడి ఎఫ్–2 సిరీస్‌లో తెరకెక్కిస్తున్న మూడో చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. ప్రస్తుతం తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో ఈ చిత్రం కోసం భారీ సెట్ వేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ మేకర్స్ వీడియో కూడా రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే కీలక పాత్రలో నటిస్తున్నారు. అలాగే ప్రముఖ తమిళ నటుడు వీటీవీ గణేశ్ మరో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఎఫ్–2, ఎఫ్–3 ఈ రెండు సినిమాలు తెరకెక్కించిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు మరోసారి ఈ హ్యాట్రిక్ సినిమాను తెరకెక్కిస్తున్నారు.

19న 'పేక మేడలు' విడుదల



హీరోగా వినోద్ కిషన్, హీరోయిన్‌గా అనూష కృష్ణ నటిస్తున్న చిత్రం 'పేకమేడలు'. క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఈనెల 19న ఈ సినిమా విడుదల కానుంది. ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా డైరెక్టర్ నీలగిరి మామిళ్ల, నిర్మాత రాకేష్ వర్రే మాట్లాడుతూ 'పేక మేడలు' సినిమాను సరికొత్తగా తీశామన్నారు. అన్ని తరగతుల ప్రేక్షకులు మెచ్చేలా క్లాస్, మాస్ ఎలిమెంట్లతో సినిమాను రూపొందించామన్నారు. తమ సినిమాను ఆదరించాలని ప్రేక్షకులను కోరారు. ఈ కార్యక్రమంలో వినోద్ కిషన్, అనూష కృష్ణ, రితిక శ్రీనివాస్, జగన్ యోగి రాజ్, అనూష నూతల, గణేష్ తిప్పరాజు, నరేన్ యాదవ్ తదితర నటులంతా పాల్గొన్నారు.

ఫైనల్‌కు క్రేజికోవా, పౌలిని

- వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి 7వ సీడ్, ఇటలీకి చెందిన జాస్మిన్ పౌలిని, చెక్ రిపబ్లిక్‌కు చెందిన 31వ సీడ్ బార్బోరా క్రేజికోవా ప్రవేశించారు. గురువారం జరిగిన తొలి సెమీఫైనల్లో పౌలిని మూడుసెట్ల హోరాహోరీ పోరులో అన్‌సీడెడ్ క్రీడాకారిణి డొన్నా వేకిక్(క్రొయేషియా)ను చిత్తుచేయగా.. మరో సెమీస్‌లో క్రేజికోవా 4వ సీడ్, కజకిస్తాన్‌కు చెందిన రైబకినాను ఓడించింది. పౌలిని 2–6, 6–4, 7–6(10–8)తో వేకిక్‌ను, క్రేజికోవా 3–6, 6–3, 6–4తో రైబకినాను ఓడించారు. రెండు సెమీఫైనల్ పోటీలు మూడుసెట్ల పాటు సాగాయి. తొలి సెమీస్‌లో జాస్మిన్ పౌలిని తొలి సెట్‌ను చేజార్చుకొని మూడోసెట్ టైబ్రేక్‌లోనూ ఓ దశలో వెనుకబడ్డ పౌలిని విజేతగా నిలవడం విశేషం.

ఉత్కంఠ భరి తంగా సాగిన సెమీస్‌లో పౌలిని 2–6, 6–4, 7–6(10–8)తో వేకిక్‌ను చిత్తుచేసింది. మ్యాచ్ ప్రారంభంలో తలబడ్డ పౌలిని.. తేరుకొనేలోపే తొలిసెట్‌ను చేజార్చుకుంది. ఇక రెండోసెట్‌లో ఒక బ్రేక్ పాయింట్ సాధించి ఆ సెట్‌ను 6–4తో చేజిక్కించుకొంది. దీంతో ఇరువురు ఒక్కో సెట్‌ను గెలుచుకొని 1–1తో సమంగా నిలిచారు. మూడో సెట్‌లో ఇరువురు క్రీడాకారిణులు ప్రతి పాయింట్‌ను చేజిక్కించు కోవడంతో ఆ సెట్ టైబ్రేక్‌కు దారితీసింది. టై బ్రేక్‌లోనూ పౌలిని ఓ దశలో 4–3తో వెనుక బడ్డా.. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకొని ఆ సెట్‌ను చేజిక్కించు కొంది. దీంతో కెరీర్‌లో తొలిసారి ఓగ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లోకి పౌలిని ప్రవేశించింది. క్రేజికోవా(చెక్)–రైబకినా(కజకిస్తాన్)ల మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో శనివారం జరిగే ఫైనల్లో పౌలిని తలపడనుంది.



క్రేజికోవా



పౌలిని

పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్ నేడు..



మెద్వదెవ్ × అల్కరాజ్ — జకోవిచ్ × ముసెట్టి

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68